కల్యాణ శ్రావణం

రేపటి నుంచి శుభకార్యాల మాసం



ధర్మవరంలో ముస్తాబైన పెళ్లి మండపం



బలమైన ముహూర్తాలు

శ్రావణ మాసం అంతా శుభ కార్యాలకు బలమైన ముహూర్తాలున్నాయి. వాటిలో ఈనెల 26, 31, ఆగస్టు 9 తేదీల్లో జిల్లావ్యాప్తంగా వందలాది వివాహాలు జరగనున్నాయి. గృహ ప్రవేశాలకు ఈనెల 30తోపాటు ఆగస్టు 3, 9 తేదీలలో అనువైన ముహూర్తాలు ఉన్నాయి. జూలైలో 26, 30, 31, ఆగస్టులో 1, 3, 5, 7, 8, 10, 11, 12, 13, 14, 17 శుభ ముహూర్తాలున్నాయి. ఆయా తేదీల్లో పెద్ద సంఖ్యలో వివాహాలు జరగనున్నాయి.

వేల సంఖ్యలో వివాహాలకు ఏర్పాట్లు

కల్యాణ మండపాలు, వాహనాల బుకింగ్

పురోహితులూ బిజీ

ఊపందుకోనున్న వ్యాపారాలు

6

ధర్మవరం/అనంతపురం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): శుభకార్యాల మాసం శ్రావణం వచ్చేస్తోంది. వివాహాలకు తెరలేచింది. గత జ్యేష్ఠ, ఆషాఢ మాసాల్లో శుభ ముహూర్తాలే లేవు. శుభకార్యాలే లేవు. దీంతో శ్రావణ మాసం కోసం ఎదురుచూస్తున్నారు. నెలంతా బలమైన ముహూర్తాలు ఉండడంతో భారీగా శుభ కార్యాలకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. భారీగా వివాహాలు చేయనున్నారు. దీంతో ఇప్పటికే కల్యాణ మండపాలు, వాహనాలు బుకింగ్ అయిపోయాయి. వివాహాలు చేయించే పురోహితులు కూడా బిజీ అయిపోయారు. నెలంతా క్షణం కూడా తీరిక ఉండదని వారు చెబుతున్నారు. వివాహాలకు తోడు వరలక్ష్మీ వ్రతం, వివిధ పర్వదినాలు ఉండడంతో మార్కెట్‌లో కొనుగోళ్లు ఊపందుకోనున్నాయి. వస్త్రాలు, బంగారం విక్రయాలు ఇప్పటికే పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

ఖర్చుకు తగ్గేదే లే..

కొన్నేళ్లుగా జిల్లాలో పెళ్లిళ్ల ట్రెండ్ మారిపోయింది. చిన్నగా పెళ్లి చేయాలన్నా రూ.10లక్షల వరకు ఖర్చు చేస్తున్నారు. బడాబాబులు ఖర్చులకు అంతేలేదు. మధ్యతరగతి వారు కూడా స్థోమతకు తగ్గట్టుగా పెళ్లిళ్లు చేస్తున్నారు. దీంతో ఊరేగింపు, మెహందీ, వీడియో, లైటింగ్, భోజనాలు, (మిగతా 6లో..)

చెట్టు దిగి.. కొండెక్కిన టెంకాయ..!



- ఒక్కో కాయ రూ.60
- నెల వ్యవధిలో రూ.20 పెరిగిన ధర
- కర్ణాటక, తమిళనాడు నుంచి దిగుమతి
- శ్రావణంలో భక్తులకు భారం తప్పదా..?

6



అలంకరణలో శనీశ్వరుడు

పావగడలో ఉత్సవ శోభ

- 26 నుంచి శ్రావణమాస వేడుకలు
- ముస్తాబైన బంగారు శనీశ్వరుడు

6

ఉత్సవాలకు ముస్తాబైన శనీశ్వర ఆలయ ప్రాంగణం



ఆస్పత్రిలో అసాంఘిక శక్తులు

ప్రహరీ దెబ్బతినడంతో రక్షణ కరువు
తాగుబోతులకు అడ్డాగా మారిన వైనం
ఎవరైనా ప్రశ్నిస్తే బెదిరింపులు, దాడులు

అనంతపురం వైద్యం, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరంలోని పాతూరు సీడీ(చెస్ట్ డిసీజెస్) ఆస్పత్రి ఆవరణం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారింది. పగలు, రాత్రి అన్న తేడాలేకుండా ఆస్పత్రి ఆవరణలోకి చొరబడి మద్యం తాగుతున్నారు. ఇతర కార్యకలాపాలు సాగిస్తున్నారు. ఎవరైనా అడ్డుకుంటే దాడి చేయడం, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని అధికారులు, సిబ్బంది, రోగులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక జనావాసం, మార్కెట్, బస్టాండ్, ప్రధాన రహదారి తదితర రద్దీతో ఆస్పత్రిలోకి ఎవరొస్తున్నారో? పోతున్నారో నిర్ధారించలేపోతున్నట్లు ఆస్పత్రి వర్గాలు వాపోతున్నాయి. పటిష్టమైన ప్రహరీని నిర్మించకపోవడంతో ఆకతాయిలు గోడలను ధ్వంసం చేశారు. ఆవరణం చుట్టూ ఎక్కబడితే అక్కడి నుంచి ఇతరులు లోపలికి వస్తున్నారు.



ధ్వంసమైన ప్రహరీ నుంచి యువకుల రాకపోకలు



సీడీ ఆస్పత్రి

అన్నింటికీ ఆవాసం

దాదాపు 10ఎకరాలకు పైగా విస్తీర్ణంగల ఆవరణలో జిల్లా ఆస్పత్రుల సేవల సమన్వయ అధికారి కార్యాలయం, సీడీ ఆస్పత్రి సెకండరీ హెల్త్ సర్వీసెస్, హోమియో ఆసుపత్రి, రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్‌తో పాటు ఏపీ గిరిజ భవనం ఏర్పాటు చేశారు. అన్ని హంగులతో గిరిజన భవనాన్ని నిర్మించినా నిరుపయోగంగా ఉంది. దీంతో కొందరు ఆకతాయిలు భవనం అద్దాలు, గేట్లు, తలుపులు ధ్వంసం చేశారు. మరికొందరు అసాంఘిక కార్యకలాపాలకు వాడుకుంటున్నారు. ఈ భవనం ముందున్న పేషెంట్ అటెండెంట్ షెడ్‌ను, వెనుక సందును గలీజు పనులకు ఆవాసంగా మార్చుకున్నారు. మరోవైపు హోమియో ఆస్పత్రిలో ఓపీ సేవలందిస్తున్నారు. ముందుభాగం రోగులకు సేవలందిస్తుంటే.. వెనుక భాగాన్ని చొరబాటుదారులు ఆక్రమించుకున్నారు. ఇక్కడ మద్యం సేవించడం, మలమూత్ర విసర్జనం చేయడం పరిపాటిగా మారింది. ఇక్కడి మరుగుదొడ్లను సైతం మద్యం తాగేందుకు ఆవాసంగా మార్చేశారు.

పరిపాలన, వైద్య సేవలు

డైరెక్టర్ సెంకడరీ హెల్త్ ఆధ్వర్యంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిస్ట్రిక్ట్, ఏరియా, సీహెచ్‌సీ మొత్తం 22 ఆస్పత్రులున్నాయి. వీటి పరిపాలనలకు జిల్లా ఆసుపత్రుల సేవల సమన్వయ అధికారి(డీసీహెచ్ఎస్) కార్యాల యాన్ని ఈ ఆవరణంలోనే ఏర్పాటుచేశారు. ఇక్కడి సీడీ ఆసుపత్రిలో ఊపిరితిత్తుల వ్యాధులతో బాధపడేవారికి సేవలందిస్తున్నారు. రెడ్‌క్రాస్ బ్లడ్ బ్యాంక్ ఏర్పాటు చేసి, రోజు దాతలనుంచి రక్తాన్ని సేకరిస్తున్నారు. తిరిగి అవసరమైన వారికి అందిస్తున్నారు. ఇలా పరిపాలన, వైద్యసేవలల్లో భాగంగా డాక్టర్లు, సిబ్బంది, రోగులు నిత్యం రాకపోకలు సాగిస్తున్నారు.

రోగుల్లా వస్తున్నారు

ఆసుపత్రి ఆవరణలోకి రోగుల్లా ఇతరులు వస్తున్నారు. పగలు, రాత్రి తేడాల్లేవు. ఎప్పుడు పడితే అప్పుడు రావడం మద్యం తాగడం, ఇతర పనులు చేసుకోవడం పరిపాటిగా మారింది. అడ్డుకోవడానికి సరిపడా సెక్యూరిటీ సిబ్బంది లేరు. ఒకవేళ అడ్డుకున్నా వారిని కొట్టడం, తిట్టడం చేస్తున్నారు. దీంతో డాక్టర్లు, ఉద్యోగులు, సిబ్బంది, రోగులు అందరూ భయభ్రాంతులకు గురవుతున్నారు.

- డాక్టర్ పాల్ రవికుమార్, డీసీహెచ్ఎస్

విద్యాశాఖలో కలకలం

బోగస్ మెడికల్ సర్టిఫికెట్లపై ఫిర్యాదులు

12 మంది టీచర్లపై గుట్టుగా విచారణ

6

నేటిలోగా అఫిడవిట్ దాఖలు చేయాలి

వ్యవసాయ శాఖకు హైకోర్టు ఆదేశం

వ్యవసాయ సహాయకుల పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా

7

గూగూడు కుళ్లాయిస్వామి

హుండీ చోరీ

ఎవరీ.. సారు.. మేడం..?

సర్వజనాస్పత్రిలో సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ల ఓవరాక్షన్

అధికారుల్లా.. తోటి సిబ్బందిపై అజమాయిషీ..
వారికి ప్రెజెంట్ చెబితేనే హాజరు
అధికారులతో మొరపెట్టుకున్న బాధితులు
అయినా.. చోద్యంచూస్తున్న వైనం

అనంతపురం వైద్యం, జూలై23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో ఇద్దరు సీనియర్ ల్యాబ్ టెక్నీషియన్ల ఓవరాక్షన్ హెచ్చుమీరినట్లు తెలుస్తోంది. తామే అధికారుల్లా తోటి ల్యాబ్ టెక్నీషియన్లపై అజమాయిషీ చేస్తున్నట్లు బాధిత వర్గాలు వాపోతున్నాయి. వారికి హాజరు వేయాల్సింది అధికారులు.. కాగా, సీనియర్లే వేస్తున్నట్లు విమర్శలున్నాయి. వారికి 'ప్రెజెంట్ సార్.. మేడం..' అని చెప్పకపోతే.. విధులకు వచ్చినా.. హాజరు వేయరని బాధితులు ఆరోపిస్తున్నారు. ఏళ్లుగా వేధింపులు కొనసాగుతున్నట్లు ఆస్పత్రి వర్గాల ద్వారా తెలుస్తోంది. వారి వేధింపులు భరించలేకపోతున్నామని బాధిత టెక్నీషియన్లు.. అధికారుల వద్ద గోడు వెల్లబోసుకుంటున్నారు. అయినా, ఉన్నతాధికారులు మౌనం వహిస్తుండడం విమర్శలకు తావిస్తోంది.

ఆ అధికారం ఎవరిచ్చారు?

ప్రభుత్వ వైద్య కళాశాలకు అనుసంధానంగా సర్వజన ఆస్పత్రి ఏర్పాటైంది. కళాశాలలోని పెథాలజీ, మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్లు.. ఆస్పత్రికి వచ్చే రోగులకు రక్తపరీక్షలు నిర్వహిస్తాయి. వీటిలో 40 మంది వరకు ల్యాబ్ టెక్నీషియన్లు, ల్యాబ్ అసిస్టెంట్లు పనిచేస్తున్నారు. వారి పరిపాలనా అంశాలను వైద్య కళాశాల, ఆస్పత్రి అధికారులు సంయుక్తంగా పర్యవేక్షించాలి. కొంతమంది టెక్నీషియన్లు అధికారుల స్థానంలో అజమాయిషీ చెలాయిస్తున్నారని బాధిత వర్గాలు వాపోతున్నాయి. ల్యాబ్ టెక్నీషియన్లు అధికారం చెలాయిస్తుంటే.. అధికారులు ఏం చేస్తున్నారన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. వారికి ఆ అధికారం ఎవరు, ఎందుకిచ్చారన్నది ఉన్నతాధికారులే సెలవియ్యాలి. సీనియర్లే.. తోటి ల్యాబ్ టెక్నీషిన్లకు డ్యూటీలు వేస్తున్నారన్న ఆరోపణలు కూడా వినిపిస్తున్నాయి.



అధికారులతో గోడు వెల్లబోసుకుంటున్న బాధితులు

ఆ అధికారం ఇవ్వలేదు



ఆస్పత్రిలో పనిచేసే ల్యాబ్ టెక్నీషియన్లు, అసిస్టెంట్లు అందరూ సమానమే. ప్రతి ఒక్కరూ విధులు నిర్వహించాల్సిందే. ఎవరికీ పర్యవేక్షణ అధికారాలు ఇవ్వలేదు. టెక్నీషియన్లు, అసిస్టెంట్ల డ్యూటీలు, హాజరు, జీతాలు ఇలా అన్నీ పరిపాలనా విభాగం ఆధ్వర్యంలోనే సాగించేలా కమిటీ వేశాం. ఇకపై డ్యూటీలు మాత్రమే చేయాలి.

-ప్రొఫెసర్ ఆత్మారామ్, సూపరింటెండెంట్, సర్వజన వైద్యశాల

జీడిపల్లి వైపు కృష్ణమ్మ పరుగులు

రాగులపాడు ఎత్తిపోతల పథకం నుంచి నీరు విడుదల



రాగులపాడు వద్ద రెండు పంపులతో కాలువకు విడుదలవుతున్న నీరు

6లో

వేధింపులను క్షణం కూడా

భరించొద్దు

మహిళలు, బాలికలు ధైర్యంగా బయటకు చెప్పాలి
ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ
'మహిళల రక్షణ, భద్రత-సాధికారత'పై అవగాహన



సదస్సులో ప్రసంగిస్తున్న ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ

అనంతపురం క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): లైంగిక వేధింపులను క్షణం కూడా భరించవద్దని మహిళలు, బాలికలకు ఏపీ మహిళా కమిషన్ చైర్ పర్సన్ రాయపాటి శైలజ సూచించారు. వాటి గురించి ధైర్యంగా బయటకు వచ్చి చెప్పాలని అన్నారు. జిల్లా పర్యటనకు వచ్చిన ఆమె, నగరంలోని ఎస్ఎస్‌బీఎన్ కళాశాల ఆడిటోరియంలో నిర్వహించిన 'మహిళల రక్షణ, భద్రత-సాధికాతర'పై జిల్లా స్థాయి అవగాహన సదస్సులో ప్రసంగించారు. అంతకు మునుపు ఐసీడీఎస్ స్టాల్‌ను పరిశీలించారు. ఆ శాఖ ఆధ్వర్యంలో చేసిన కార్యక్రమాల వివరాలను తెలుసుకున్నారు. జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభించారు. పనిచేసే చోట, కళాశాలలు, ఇతర ప్రాంతాల్లో మహిళలు, బాలికలకు వేధింపులు ఎదురవుతూ ఉంటాయని ఆమె అన్నారు. గృహహింస, బాల్య వివాహాలు, టీనేజ్ ప్రెగ్నెన్సీ వంటి అనేక సమస్యలను వారు ఎదుర్కొంటున్నారని అన్నారు. వారి హక్కుల రక్షణ కోసం మహిళా కమిషన్, ప్రభుత్వం ఎంతగానో కృషి చేస్తున్నాయని అన్నారు. కొందరు అమ్మాయిలు పెళ్లి అయినవారి ట్రాప్‌లో కూడా పడి జీవితాన్ని నాశనం చేసుకుంటున్నారని అన్నారు. లవ్ ట్రాప్‌లో అస్సలు పడవద్దని, తల్లిదండ్రులు చెప్పే మంచి విషయాలను వినాలని సూచించారు. చదువుపై దృష్టి పెట్టాలని, బాగా చదువుకుంటేనే భవిష్యత్తులో ఎలాంటి సమస్యలు ఎదురైనా ఎదుర్కొనే ధైర్యం (మిగతా 6వ పేజీలో)

కటకటాల్లోకి శిష్యురాలి ప్రియుడు

మాస్టారును బ్లాక్‌మెయిల్ చేసిన కేసులో నిందితుడి అరెస్టు

అనంతపురం క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): డబ్బు కోసం ప్రియురాలితో కలిసి ఓ మాస్టారును బ్లాక్ మెయిల్ చేసిన కేసులో నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. సీఐ శ్రీకాంత్ యాదవ్.. ఎస్ఐ శ్రీనివాసులుతో కలిసి బుధవారం రాత్రి కేసు వివరాలను వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో మీడియాకు వివరించారు. నితీష్ కుమార్ అనే వ్యక్తిని తపోవనానికి చెందిన చాగలేటి వంశీకృష్ణ బ్లాక్ మెయిల్ చేశాడు. తన గర్ల్‌ఫ్రెండ్‌తో చనువుగా ఉన్నాడని ఆరోపిస్తూ బెదిరించాడు. కేసు పెడతానని బెదరగొట్టి.. నితీష్ కుమార్ నుంచి లక్ష రూపాయలు వసూలు చేశాడు. నితీష్ కుమార్ ఇంటికి మంగళవారం వెళ్లి రూ.1000 డబ్బు, సెల్‌ఫోన్ లాగేసుకున్నాడు. మరో లక్ష రూపాయలు ఇవ్వాలని, తాను అడిగినపుడల్లా ఇచ్చుకోవాల్సిందేనని డిమాండ్ చేశాడు. దీంతో బాధితుడు పోలీసులను ఆశ్రయించాడు. ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు విచారణ చేపట్టారు. అందులో భాగంగా బుధవారం మధ్యాహ్నం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి వద్ద నిందితుడు వంశీకృష్ణను అరెస్టు చేశారు. అతడి నుంచి రూ.1000 నగదు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నామని సీఐ తెలిపారు.



వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీకాంత్ యాదవ్, ఎస్ఐ శ్రీనివాసులు

పోలీసు ప్రతిష్ట పెంచేలా పనిచేయండి

కొత్త ఎస్ఐలకు ఎస్పీ దిశానిర్దేశం



మాట్లాతున్న ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): పోలీసుల ప్రతిష్ట పెంచేలా పనిచేయాలని కొత్త సబ్ ఇన్‌స్పెక్టర్లకు ఎస్పీ జగదీష్ దిశానిర్దేశం చేశారు. జిల్లాకు కొత్తగా 17 మంది ప్రొబేషనరీ ఎస్ఐలను కేటాయించారు. అందులో నలుగురు మహిళా ఎస్ఐలు ఉన్నారు. కొత్త ఎస్ఐలతో బుధవారం ఎస్పీ తన చాంబర్‌లో సమావేశం నిర్వహించారు. విధుల్లో ఎలా ప్రవర్తించాలో, ప్రజలు, ఉన్నతాధికారులతో ఎలా నడుచుకోవాలో సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. శాంతి భద్రతలను కాపాడటం పోలీసు విధుల్లో కీలకం అన్నారు. నేరాలు అరికట్టడం, ట్రాఫిక్ నియంత్రణ, సైబర్ క్రైం, మాదక ద్రవ్యాల అక్రమ రవాణా, మహిళలపై వేధింపులు తదితర సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. విధుల్లో సామాజిక స్పృహ ఉండాలని సూచించారు. ప్రజలతో కలిసిపోతూ పోలీసు శాఖ ప్రతిష్టను పెంచాలని హితబోధ చేశారు.

రైళ్లలో చోరీలపై నిఘా పెంచాలి

- సౌత్‌సెంట్రల్ రైల్వే డీఐజీ ఎండీఎస్‌జెడ్ ఖాన్

7

కల్యాణ శ్రావణం

(5వ పేజీ తరువాయి)

బంగారం, దుస్తుల కొనుగోలుకు పెద్దఎత్తున ఖర్చు పెడుతున్నారు. కొన్ని వివాహాలకు కోట్లలో వెచ్చిస్తున్నారు. భోజనాల్లో 20 నుంచి 30 రకాల వంటకాలు చేయించడానికి కూడా రాజీపడటం లేదు.

ఇప్పటికే వాహనాలన్నీ బుకింగ్

శ్రావణ మాసం నేపథ్యంలో ప్రైవేటు వాహనాలకు విపరీతమైన డిమాండ్ ఏర్పడింది. ప్రైవేటు ట్రావెల్స్ బస్సులు ముందస్తుగా బుకింగ్ అయిపోయాయి. కొంతమంది అడ్వాన్స్‌లు కూడా ఇచ్చేసుకున్నారు. శ్రావణంలో వాహనాలు దొరకాలన్నా కష్టమే. పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలు చేయించే పురోహితులు బిజీ కానున్నారు. క్యాటరింగ్, డెకరేషన్‌కు కూడా బుకింగ్ చేసుకున్నారు.

ఊపందుకోనున్న వ్యాపారాలు

రెండు నెలలుగా శుభ ముహూర్తాల్లేక వ్యాపారాలు మందగించాయి. శ్రావణ మాసం రాకతో ఊపందుకోనున్నాయి. ఇప్పటికే పెళ్లిల్లు ఇతర శుభకార్యాల కోసం దుస్తులు, బంగారం కొని పెట్టుకుంటున్నారు.

శ్రావణ మాసంలో ఇతర పండుగలు కూడా ఉండడంతో అన్నిరకాల వ్యాపారాలు జోరందుకోనున్నాయి. వ్యాపారులు సైతం శ్రావణ మార్కెట్‌పై ఆశలు పెట్టుకున్నారు.

ముందుగానే బుకింగ్..



శ్రావణ మాసం ప్రారంభమవుతుండడంతో వివాహాలు, వివిధ శుభ కార్యాలయాలకు ముందుగానే కల్యాణ మండపం రిజర్వ్ చేసుకుంటున్నారు. ఏయే రోజుల్లో ఖాళీగా ఉన్నాయని కొందరు అడిగి వెళ్తున్నారు. ముహూర్తాలన్నీ ఏకబిగిన రావడంతో మండపాల కొరత రావచ్చు.

-చెన్నంశెట్టి జగదీశ్, సీబీఎన్ కల్యాణమండపం నిర్వాహకుడు, ధర్మవరం

తీరిక ఉండదు



శ్రావణ మాసం అంటేనే శుభకార్యాలయాలకు ప్రతీతి. ఈ నెలలో పెళ్లిళ్లు ఇతర శుభకార్యాలు ఎక్కువగా ఉంటాయి. వరలక్ష్మీ వ్రతానికి అత్యంత ప్రాచుర్యం ఉంటుంది. నెలంతా పురోహితులకు క్షణం తీరిక ఉండదు.

-రాజేశ్, పురోహితుడు

పండుగలే పండుగలు

పున్నమి చంద్రుడు శ్రవణా నక్షత్రంలో సంచరించడం వల్ల ఈ మాసంలో ఒక్కో రోజుకు ఒక్కో విశిష్టత ఉందని పండితులు పేర్కొన్నారు. ఈ మాసంలో వచ్చే అన్ని శుక్రవారాల్లోనూ శ్రావణ లక్ష్మి పూజలు చేస్తారు. నాలుగు మంగళవారాల్లో మంగళగౌరిని పూజిస్తారు. మరిన్ని పర్వదినాలు ఆచరించనున్నారు.

జూలై 29న నాగుల పంచమి
ఆగస్టు 8న వరలక్ష్మీవ్రతం
9న రాఖీపౌర్ణమి
12న సంకష్ట హరచతుర్థి
16న శ్రీకృష్ణాష్టమి
19న అజ ఏకాదశి
23న పోలాల అమావాస్య



చెట్టు దిగి.. కొండెక్కిన టెంకాయ..!



సూపర్‌మార్కెట్‌లో చిన్నపాటి కొబ్బరికాయ రూ.45 రాసిన దృశ్యం

హిందూపురం, జూలై 23(ఆంధ్రజ్యోతి): శ్రావణ మాసంలో పూజలు నిర్వహించే భక్తులను టెంకాయ ధరలు భయపెడుతున్నాయి. సాధారణ రోజుల్లో ఒక్కో టెంకాయ గరిష్ఠ ధర రూ.35 వరకూ ఉంటుంది. ప్రస్తుతం కొరత కారణంగా రూ.60కి చేరింది. కర్ణాటక, తమిళనాడులో పంట తగ్గిపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది. ఉమ్మడి జిల్లా వ్యాపారులు సుదూర ప్రాంతాల నుంచి టెంకాయలను కొనుగోలు చేసి తెచ్చుకుంటారు. దీంతో రవాణా ఖర్చులు పెరిగిపోయాయి. దీంతో కాయ సైజును బట్టి కనీసం రూ.35 ఆపై రూ.60 వసూలు చేస్తున్నారు. నెల వ్యవధిలో ఒక టెంకాయపై రూ.20 ధర పెరిగిందని వ్యాపారులు చెబుతున్నారు. ధరలు పెరగడంతో తక్కువగా తెచ్చుకుంటున్నామని, లాభాలు తగ్గాయని వాపోతున్నారు. ధర భారీగా పెరగడంతో సామాన్యులు కొనడం లేదని, ఆలయాల్లో టెంకాలను కొట్టడం తగ్గించేశారని అంటున్నారు.

పంట లేకపోవడమే..

ఉమ్మడి జిల్లాలో కొబ్బరి చెట్లు చాలా తక్కువ. దీంతో కర్ణాటకలోని తుమకూరు, టిప్టూరు, శివమొగ్గ, తమిళనాడు, కొయంబత్తూరు, పొలచి నుంచి కొనుగోలు చేసి తెచ్చుకుంటారు. అక్కడ కూడా చెట్లకు చెదలు, పురుగులు పట్టడంతో ఈసారి పంట దిగుబడి 50 శాతానికి పైగా తగ్గింది. దీనికితోడు రాష్ట్రంలో కూడా కొబ్బరికాయల పంట పూర్తిగా రాలేదు. ఈ కారణాలతో ధరలు ఒక్కసారిగా భారీగా పెరిగాయి.

ఇప్పుడే ఇలా అయితే..

ఇప్పుడు పెరిగిన ధరలు ఆషాడ మాసంలో అమలులో ఉన్నవి. ఇళ్లలో మినహా ఆలయాల్లో పెద్దగా పూజలు ఉండవు. ఆ మేరకు టెంకాల వినియోగం కూడా తక్కువగానే ఉంది. నిత్యం శుభకార్యాలు జరిగే శ్రావణ మాసం శుక్రవారం నుంచి మొదలౌతుంది. అప్పుడు పరిస్థితి ఎలా ఉంటుందోనని భక్తులు, వ్యాపారులు భయపడే పరిస్థితి ఏర్పడింది. సాధారణ పూజలకు ఒకటి రెండు టెంకాయలు సరిపడతాయి. కానీ శుభకార్యాల కోసం వందల్లో కొనాల్సి ఉంటుంది. దీంతో ఖర్చు తడిసి మోపడవుతుంది. వరలక్ష్మీవ్రతం, నాగులచవిత, వినాయకచవితి వంటి పండుగలు వరుసపెట్టి వస్తాయి. పెళ్లి, పేరంటం, గృహ ప్రవేశాలు వంటివి భారీగా జరుగుతాయి. డిమాండ్ పెరిగితే టెంకాయల ధరలు మరింత పెరుగుతాయని సామాన్యులు ఆందోళన చెందుతున్నారు.

ఎళ్లీరు కూడా కారణం

కర్ణాటక, తమిళనాడు నుంచి వచ్చే టెంకాయలతో పాటు ఎళ్లీరు (కొబ్బరి బోండాం) నీటికి ఎక్కువ గిరాకీ ఉంటుంది. అనారోగ్యం బారినపడితే ప్రతిరోజూ ఎళ్లీరు నీరు తీసుకుంటారు. ప్రస్తుతం కొబ్బరికాయకంటే ఎళ్లీరు ధర ఎక్కువగా ఉంటోంది. మంచి లాభాలు వస్తాయని ఎళ్లీరు కాయలు అమ్మడానికే రైతులు ఎక్కువగా మొగ్గు చూపుతారు. పైగా మూడు నెలలకే చెట్టు నుంచి పంటను తీసుకోవచ్చు. అదే టెంకాయ అయితే నాలుగు నుంచి ఐదునెలలపాటు చెట్టుపైనే కాయను ఉంచాల్సి వస్తుంది.



విక్రయించడానికి సిద్ధంగా ఉంచిన కొబ్బరికాయలు

ఒకప్పుడు లోడు తీసుకునేవాళ్లం..

గతంలో ఆషాడ మాసంలోనే లోడు కొబ్బరికాయలు (సుమారు 15 వేలు) దిగుమతి చేసుకునేవాళ్లం. కానీ ఇప్పుడు ధరలు పెరగడంతో ప్రస్తుతం వెయ్యి లేదా రెండు వేల కాయలు మాత్రమే తీసుకుంటున్నాం. వ్యాపారాలు కూడా బాగా తగ్గాయి.

-నాగరాజు, కొబ్బరికాయల వ్యాపారి

ఎప్పుడూ ఈ ధర చూడలేదు..

నేను 20 ఏళ్లుగా కొబ్బరికాయల వ్యాపారం చేస్తున్నాను. గతంలో ఎప్పుడూ ఇలా ఉన్నట్టుండి కొబ్బరి కాయల ధరలు పెరగడం చూడలేదు. ఇందుకు మన రాష్ట్రంతో పాటు కర్ణాటక, తమిళనాడులో పంట రాకపోవడమే కారణం.

-బాషా, కొబ్బరికాయల వ్యాపారి, హిందూపురం

పావగడలో ఉత్సవ శోభ

26 నుంచి శ్రావణమాస వేడుకలు

పావగడ, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ప్రసిద్ధి చెందిన శనీశ్వరుడి ఆలయం శ్రావణ మాస ఉత్సవాలకు ముస్తాబైంది. ఈనెల 25నుంచి జరిగే శ్రావణమాస ఉత్సవాలకు బంగారు కవచాలతో స్వామి అలంకృతమయ్యారు. ఉత్సవాల్లో జేష్టాదేవి సమేతంగా స్వామివారు భక్తులకు దర్శనమిస్తారు. ఈనెల 25నుంచి వచ్చేనెల 23వ తేదీ వరకు ఐదు శ్రావణ శనివారాల్లో ఉత్సవాలు అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు. అందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.



సిద్ధమైన సువర్ణ శనీశ్వరుడు

శనివారాల్లో..

జూలై 26న మొదటి శ్రావణ శనివారం సందర్భంగా ఉదయం నాలుగు గంటలకు స్వామివారికి తొలిపూజ చేస్తారు. పంచామృతాభిషేకాలు, నవగ్రహ పూజ నిర్వహిస్తారు. అదేరోజు రాత్రి7.30కి స్వామివారికి విశేష పూజలు చేయనున్నట్లు ప్రధాన అర్చకులు కృష్ణస్వామి, మనోహర్, సంజయ్ తెలిపారు. ఆగస్టు 2, 8, 16, 23 తేదీల్లో జేష్టాదేవి సమేతంగా వెండి పల్లకిలో స్వామివారు ఊరేగనున్నారు.

సకల దోషాలు తొలగుతాయని..

శ్రావణమాసం ఉత్సవాల సందర్భంగా శనేశ్వరున్ని దర్శించుకుంటే సకల శనిదోషాలు తొలగుతాయని భక్తుల అపార నమ్మకం. స్వామివారికి ఎంతో ఇష్టమైన నల్లగుడ్డ, నల్లనువ్వులు, నువ్వుల నూనె, అగ్నిగుండం చుట్టూ ప్రదక్షిణ చేసి, అందులోకి వేస్తే సకల పాపాలు తొలగిపోతాయని వారి విశ్వాసం. ఈ ఉత్సవాలకు ఉమ్మడి అనంత జిల్లాతోపాటు తమిళనాడు, కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివస్తారు.

హనుమాన్ దర్శన్ ప్రత్యేకం

బస్సు సర్వీసులు నడపనున్న ఆర్టీసీ

అనంతపురం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): శ్రావణమాసంలోని మంగళ, శనివారాల్లో ఒకే రోజున మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకోవడం అనంతపురం జిల్లాలో ఆనవాయితీగా వస్తోంది. ఇందుకోసం ఏటా ఆర్టీసీ శ్రావణమాసంలో ప్రత్యేక బస్సు సర్వీసులను నడుపుతోంది. ఈ ఏడాది కూడా నడపనున్నట్లు అనంతపురం డీఎం నాగభూపాల్ వెల్లడించారు.

ఈనెల 26, 29, ఆగస్టు 2, 5, 9, 12, 16, 19 తేదీల్లో కసాపురం, మురడి, నేమకల్లు ఆంజనేయస్వామి దేవాలయాలను దర్శించుకునే భక్తులకోసం బస్సు సర్వీసులను నడపుతున్నట్లు పేర్కొన్నారు. మూడు ఆంజనేయస్వామి దేవాలయాలను ఒకేరోజున దర్శించుకునే వెసులుబాటు కల్పించారు. ముందస్తు రిజర్వేషన్ అవకాశం కూడా కల్పించినట్లు తెలిపారు.

పుణ్యఫలాలను ప్రసాదించే మాసం



శ్రావణం అత్యధికంగా పుణ్యఫలాలను ప్రసాదించే మాసం. ముత్తైదువులు ఈ మాసంలో అమ్మవారికి ముఖ్యంగా శ్రీచక్ర కుంకుమార్చన చేసుకోవడం వల్ల శుభఫలితాలను పొందుతారు.

- నరసింహశాస్త్రి, కాశీవిశ్వేశ్వర కోదండ దేవాలయం, అనంతపురం

విద్యాశాఖలో కలకలం

బోగస్ మెడికల్ సర్టిఫికెట్లపై ఫిర్యాదులు

12 మంది టీచర్లపై గుట్టుగా విచారణ

అనంతపురం విద్య, జూలై 23(ఆంధ్రజ్యోతి): బోగస్ మెడికల్ సర్టిఫికెట్లపై విచారణ విద్యాశాఖలో కలకలం రేపుతోంది. బదిలీల్లో అనుకూల స్థానాలు పొందేందుకు పలువురు టీచర్లు లేనిరోగాలను ఉన్నట్లు బోగస్ మెడికల్ సర్టిఫికెట్లు పెట్టారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. అధికారిక లెక్కల మేరకు అన్ని కేడర్లలో కలిపి మే, జూన్ నెలల్లో చేపట్టిన బదిలీల్లో 422 మంది టీచర్లు వివిధ రకాల మెడికల్ సర్టిఫికెట్లతో ప్రిఫరెన్షియల్ కింద దరఖాస్తు చేసుకున్నారు. బదిలీలు పూర్తయి, వారికి కేటాయించిన స్థానాల్లో టీచర్లు చేరిపోయారు కూడా. ఇపుడు ఆ బోగస్ మెడికల్ సర్టిఫికెట్లపై విద్యాశాఖ గుట్టుగా విచారణ మొదలు పెట్టింది. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా 12 మందిటీచర్లపై రాష్ట్రస్థాయి అధికారులకు ఫిర్యాదులు వెళ్లాయి. వారి మెడికల్ సర్టిఫికెట్లను పక్కాగా పరిశీలించి, వాస్తవ నివేదికలు పంపాలని కమిషనరేట్ నుంచి జిల్లా విద్యాశాఖకు ఆదేశాలు వచ్చాయి. ఆ మేరకు జిల్లా అధికారులు ఆ 12 మంది టీచర్ల మెడికల్ సర్టిఫికెట్లపై విచారణ సాగిస్తున్నారు. డిప్యూటీ డీఈఓలు మెడికల్ సర్టిఫికెట్లను తెప్పించుకుని, పరిశీలిస్తున్నారు. దీంతో టీచర్లలో టెన్షన్ మొదలైంది. పెద్దఎత్తున టీచర్లు బోగస్ మెడికల్ సర్టిఫికెట్లు పెడితే.. 12 మంది పైనే విచారణ చేయడం ఏంటని ఉపాధ్యాయ వర్గాలు మండిపడుతున్నాయి. ఏదిఏమైనా మెడికల్ సర్టిఫికెట్ల పరిశీలన జాబితాలో ఉన్న టీచర్లలో ఆందోళన నెలకొంది.

విచారణ చేస్తున్నాం: డీఈఓ

బదిలీల్లో ప్రిఫరెన్షియల్ కింద లబ్ధిపొందిన టీచర్ల మెడికల్ సర్టిఫికెట్లపై ఫిర్యాదులు వచ్చాయి. ఉమ్మడి జిల్లాలో 12మంది టీచర్ల సర్టిఫికెట్లపై విచారణ చేసి, నివేదిక ఇవ్వాలని రాష్ట్ర శాఖ నుంచి ఆదేశాలు జారీ అయ్యాయి. ఆ మేరకు ఆజాబితాలో ఉన్న టీచర్ల మెడికల్ సర్టిఫికెట్లను పునఃపరిశీలిస్తున్నాం. ఈ బాధ్యతలను ఆయా డిప్యూటీ డీఈఓలకు అప్పగించాం. విచారణ చేస్తున్నారు.

చినుకు పడితే... కునుకు కరువు..!

15 ఏళ్ల క్రితం తెగిన ఆత్మకూరు చెరువు

వృథాగా పోతున్న చెరువునీరు

మరమ్మతులు పట్టని అధికారులు, పాలకులు

వరద వస్తే మునుగుతున్న కాలనీలు



ఆత్మకూరు, జూలై23(ఆంధ్రజ్యోతి): వర్షాకాలం వచ్చిందంటే మండల కేంద్రంలోని పలు కాలనీల ప్రజలు ముంపు భయంతో వణికిపోతుంటారు. భారీ వర్షం కురిసినపుడల్లా కాలనీలు మునకే. ఏటా పలుమార్లు ఇదే దుస్థితి ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రంలోనే ఉన్న చెరువు తెగిపోయి 15 ఏళ్లయింది. దీంతో భారీ వర్షం కురిసినపుడల్లా కాలనీల్లోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతోంది. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై పెద్దఎత్తున వరద ప్రవాహంతో వాహన రాకపోకలకు అంతరాయం ఏర్పడుతోంది. వర్షపు నీరు చెరువులో నిల్వ ఉండకుండా వచ్చినది వచ్చినట్లుగా వెళ్లిపోతుండడంతో భూగర్భ జలమట్టాలు తగ్గిపోతున్నాయనీ, వ్యవసాయ బోర్లు ఎండిపోతున్నాయని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా చెరువుకు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు. చెరువు తెగిపోయి, వరదంతా కిందనే ఉన్న చెక్ డ్యాంలోకి చేరుతోంది. ఆ నీరు కాలనీలను ముంచెత్తుతుండడంతో దానినీ తెగ్గొట్టారు. గత టీడీపీ హయాంలో చెరువు మరమ్మతులకు చర్యలు చేపట్టగా.. అప్పట్లో వైసీపీ నాయకులు అడ్డుపడినట్లు తెలుస్తోంది. తమ పార్టీ అధికారంలోకి రాగానే చెరువు మరమ్మతులు చేస్తామని ప్రగల్భాలు పలికినట్లు సమాచారం. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పాలించినా.. చెరువు మరమ్మతుల ఊసే ఎత్తలేదని మండల కేంద్రం వాసులు మండిపడుతున్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో మరమ్మతులకు అడుగులు పడుతున్నాయని రాజకీయ వర్గాల ద్వారా తెలుస్తోంది.



గతేడాది పాత ఎస్సీ కాలనీలో నిలిచిన వర్షపునీరు

అనుమతులు లభించినా..

వర్షం వచ్చినపుడల్లా వరద నీటితో స్థానిక సర్దార్ వలి దర్గా దగ్గర తీవ్ర అసౌకర్యంగా ఉంటోంది. సమీప ఇళ్లను నీరు ముంచెత్తుతోంది. పాత ఎస్సీ కాలనీలోకి పెద్దఎత్తున నీరు చేరుతోంది. ప్రవాహం తగ్గేవరకు బయటకు రాలేని పరిస్థితి ఏర్పడుతోంది. వర్షపునీరు గతంలో అధికంగా రావడంతో సమీపాన 5 లక్షలతో నిర్మించిన చెక్ డ్యాంను అధికారులు ఎక్స్‌కవేటర్‌తో తెగ్గొట్టేశారు. ఇంతవరకు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టలేదు. వర్షాకాలం వస్తే.. చెరువు సమీపాన నివాసముండేవారు బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే. ఏళ్లుగా చెరువు మరమ్మతులు చేయాలని వినతి పత్రాలు అందజేసినా పట్టించుకునే నాథుడే కరువయ్యాడని గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలుసార్లు మరమ్మతులు చేయాలని ప్రతిపాదనలు పంపి, అనుమతులు లభించినా పనులు ముందుకు సాగలేదు. దీంతో ప్రతిసారీ నిధులు వెనక్కిపోతున్నాయి. గ్రామానికి ఉన్న ఏకైక చెరువులో కూడా నీరు నిల్వ లేకపోవడంతో చుట్టుపక్కల భూగర్భ జలాలు పడిపోతున్నాయి. చివరికి చేతిపంపుల్లో నీరు రాక నిరుపయోగంగా మారాయి.

బిక్కుబిక్కుమంటూ గడపాల్సిందే..



వర్షాకాలం వస్తే రాత్రి వేళల్లో నిద్ర ఉండదు. ఇంటిల్లిపాదీ బిక్కుబిక్కుమంటూ గడపాల్సి వస్తుంది. మాగోడు పట్టించుకునేవారు లేరు. భారీ వర్షం వస్తే పెద్దఎత్తున వరద నీరు కాలనీని ముంచెత్తుతుంది. నెలరోజులైనా ఇంటి ముందు నీరు తగ్గదు. కాలనీలోకి వర్షపునీరు రాకుండా చర్యలు చేపట్టాలి. - సంధ్య, ఎస్సీ కాలనీ, ఆత్మకూరు

పట్టా భూములతోనే చిక్కులు

చెరువు మరమ్మతులు చేస్తే నీరు నిల్వ ఉంటుంది. ముంపు ప్రాంతం పట్టా భూములు కావడంతో మరమ్మతులు చేయడానికి ఆటంకాలు ఎదురవుతున్నాయి. టీడీపీ హయాంలో భూములకు పరిహారం ఇచ్చి, స్వాధీనం చేసుకునేలా సంబంధిత రైతులతో అధికారులు చర్చలు జరిపారు. రైతులు ముందుకు రాకపోవడంతో చెరువు మరమ్మతులు నిలిచిపోయాయి. ఆ తరువాత వైసీపీ పాలనలో పట్టించుకునే నాథుడే లేకుండాపోయాడు. రోడ్డుపై వర్షపునీటితో కష్టాలు పడ్డారు. ప్రస్తుతం వర్షాలు ప్రారంభమవడంతో స్థానికుల్లో భయం మొదలైంది. చెరువు మరమ్మతులు మాత్రం రైతులతో మాట్లాడి సానుకూలంగా సమస్య పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

కోతకు గురైన భూములు

వర్షపునీరు తెగిపోయిన చెరువు నుంచి అధికంగా రావడంతో చెరువు ప్రాంతంతో పాటు కింద ప్రాంతంలో భూమి కోతకు గురవుతోంది. మనిషిలోతు గోతి ఏర్పడి, ప్రమాదకరంగా మారింది. చెరువు కింద కాలువ భద్రత లేక అటు, ఇటు నర్సరీల్లోకి నీరు చేరుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చెరువు మరమ్మతులు చేపట్టి వర్షపునీటిని అదుపుచేయాలని గ్రామ ప్రజలు కోరుతున్నారు.



వర్షపునీటిలో నడవాల్సిందే: శివారెడ్డి, ఆత్మకూరు



వర్షం వచ్చిందంటే ఇంటి చుట్టూ నీరు చేరుతోంది. బయటకు వెళ్లే అవకాశం కూడా ఉండదు. చెరువు నుంచి ఉధృతంగా వచ్చేనీరు మరింత ఇబ్బంది పెడుతుంది. పలుమార్లు అధికారులకు చెప్పినా ఫలితం లేదు. ఇప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టాలి.

చెరువు మరమ్మతులకు చాలాసార్లు ప్రయత్నించాం

తెగిపోయిన చెరువు మరమ్మతులు చేయాలని గతంలో చాలా సార్లు ప్రయత్నాలు చేసినా ఫలితం లేదు. చెరువు ముంపు ప్రాంతం పట్టా భూమి. సంబంధిత రైతులతో చర్చలు జరిపినా కొలిక్కి రాలేదు. వరద ముంపు విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం.

-కృష్ణకుమార్, ఇరిగేషన్ ఇంజనీర్

జీడిపల్లి వైపు కృష్ణమ్మ పరుగులు

ఉరవకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలంలోని రాగులపాడు హంద్రీనీవా కాలువ వద్ద ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం నుంచి జీడిపల్లి రిజర్వాయర్‌కు బుధవారం అధికారులు నీటిని విడుదల చేశారు. ఈ నెల17న కర్నూలు జిల్లా మల్యాల వద్ద హంద్రీనీవాకు నీటిని వదలగా.. మంగళవారం అర్ధరాత్రి పంప్‌హౌస్ వద్దకు చేరుకున్నాయి. మూడు మోటార్ల ద్వారా నీటిని ఎత్తిపోసి కాలువకు వదిలారు. 850 క్యూసెక్కుల దాకా నీటిని వదిలినట్లు అధికారులు తెలిపారు. కాలువకు నీరు రావడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. జిల్లాకు చేరుకున్న కృష్ణాజలాలకు హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులు, టీడీపీ నాయకులు జల హారతి ఇచ్చారు. రాగులపాడు లిఫ్ట్ వద్ద అధికారులు పూజలు నిర్వహించి మోటార్లను ఆన్‌చేశారు. అనంతరం పంపుల వద్ద కృష్ణాజలాలకు అధికారులు, టీడీపీ నాయకులు పూజలు చేశారు. చిన్నముష్టూరు సమీపంలో కృష్ణాజలాల్లోకి పసుపు, కుంకుమ వదిలి పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో డీఈలు రమణ, నాగరాజు, ఏఈలు సురేష్, భాస్కర్, టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, విజయ్‌భాస్కర్, రామాంజనేయులు, తిమ్మప్ప, బీసీ మారెన్న, గోవిందు, గోనుగుంట్ల నాగేంద్ర, ఎర్రిస్వామి, మాజీ ఎంపీపీ సుంకరత్నమ్మ పాల్గొన్నారు.



చిన్నముష్టూరు వద్ద పూజలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఫలించిన మంత్రి కృషి

హంద్రీనీవా కాలువ వెడల్పు పనులు పూర్తి కావడంతో నీటి ప్రవాహ సామర్థ్యం పెరగనుంది. జిల్లాలో మొదటి ఫేజ్ ప్యాకేజీ-2 పనులు పూర్తయ్యాయి. ఇరిగేషన్, రెవెన్యూ, ఏపీఎస్ఈబీ, హెచ్ఎన్ఎస్ఎస్ అధికారులను అప్రమత్తం చేస్తూ, సమీక్షలు నిర్వహిస్తూ, వంద రోజుల్లోనే పూర్తి చేస్తామని మంత్రి పయ్యావుల కేశవ్ చెప్పిన మాట నిలబెట్టుకున్నారు. సీఎం ఆదేశాలకు అనుగుణంగా మంత్రి ప్రత్యేక దృష్టిసారించి హెచ్ఎన్ఎస్ఎస్ కాలువ వెడల్పు పనులపై నీరు వచ్చేలోపు పూర్తి చేయాలని అధికారులు, కాంట్రాక్టర్లతో పనులు చేయించారు. దీంతో నీరు పారేందుకు ఎలాంటి ఆటంకాలు లేకుండా పోయాయి. గతంలో హెచ్ఎన్ఎస్ఎస్ కాలువలో 1300 నుంచి 1400 క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండగా.. వెడల్పు పనులు పూర్తి కావడంతో 3,200 నుంచి 3,450 క్యూసెక్కుల వరకూ నీరు కాలువలో ప్రవహించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. వీటితో పాటు తూముల ద్వారా చెరువులకు నీరు ఇవ్వడానికి అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వేధింపులను క్షణం కూడా భరించొద్దు

(5వ పేజీ తరువాయి)

వస్తుందని అన్నారు. స్నేహం పేరుతో సామాజిక మాధ్యమాల్లో ఎవరికీ వ్యక్తిగత వివరాలు, ఫొటోలు, వీడియోలు పంపవద్దని సూచించారు. ఇటీవలి కాలంలో బాగా చదువుకున్న డాక్టర్లు, ఇంజనీర్లు సైతం గృహహింస కేసులు పెట్టుకునే పరిస్థితి వచ్చిందని అన్నారు. పెళ్లికి ముందు కౌన్సెలింగ్‌పై కూడా ప్రత్యేక దృష్టి పెడతామని అన్నారు. ఆపద సమయాల్లో హెల్ప్‌లైన్ నంబర్లు వాడాలని, శక్తి యాప్‌ను మహిళలు, విద్యార్థినులు తప్పనిసరిగా డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. ప్రతి మహిళ సురక్షితంగా, ధృడంగా ఉండాలని అన్నారు. అనంతరం ఐసీడీఎస్ శాఖకు సంబంధించిన పలు పోస్టర్లను ఆమె ఆవిష్కరించారు. కార్యక్రమంలో డీఆర్వో మలోల, ఆర్డీఓ కేశవనాయుడు, ఐసీడీఎస్ పీడీ నాగమణి, డీఎంహెచ్ఓ డాక్టర్ ఈబీ దేవి, మాజీ మేయర్ స్వరూప, దిశ సీఐ వెంకటేశ్వర్లు, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజశ్విని, ఐసీడీఎస్ అధికారులు పాల్గొన్నారు.

సమగ్ర విచారణ జరపాలి: ఐద్వా

అనంతపురం టౌన్: ఉమ్మడి జిల్లాలో మహిళలు, బాలికల హత్యలు, వారిపై అత్యాచారాల గురించి సమగ్ర విచారణ జరిపించాలని, బాధ్యులను కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కోశాధికారి సావిత్రి డిమాండ్ చేశారు. రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజకు ఐద్వా ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. అనంతపురంలో ఇంటర్ విద్యార్థిని తన్మయి హత్య, శ్రీసత్యసాయి జిల్లాలో అత్తాకోడళ్లపై సామూహిక అత్యాచారం, రామగిరి మండలంలో 9వ తరగతి విద్యార్థినిపై 14 మంది అత్యాచారం తదితర ఘటనలను ఆమె దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో బాలికలు, మహిళలపై అత్యాచారాలు, హత్యలు పెరిగిపోతున్నాయని అన్నారు. మద్యం, గంజాయి, పోర్న్ వీడియోలు దీనికి కారణమని అన్నారు. అన్ని విద్యాసంస్థల్లో అవగాహన సదస్సులు నిర్వహించాలని కోరారు. ఈ కేసుల సత్వర విచారణకు ఫాస్ట్ ట్రాక్ కోర్టులు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా నాయకురాళ్లు చంద్రిక, శైలజ, గీత తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న ఐద్వా నాయకురాలు సావిత్రి తదితరులు

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య


పాళ్యం రామ్మూర్తి (ఫైల్)

చెన్నేకొత్తపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): అప్పుల బాధ తాళలేక ఓ రైతు తన వ్యవసాయ పొలంలోనే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు... చెన్నేకొత్తపల్లి మండలంలోని నామాల గ్రామానికి చెందిన పాళ్యం రామ్మూర్తి(38) అనే రైతు తన సొంత వ్యవసాయ తోటలో పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. రామ్మూర్తి మూడెకరాల సొంత పొలంతో పాటు తొమ్మిది ఎకరాలు కౌలుకు తీసుకుని పంటలు సాగుచేసుకుంటుండేవాడు. 12 బోర్లు వేసినా నీరు పడలేదు. దీనికి తోడు గత కొన్నేళ్ల నుంచి బెండ, గోరుచిక్కుడు, వేరుశనగ పంటలు సాగుచేస్తూ తీవ్రంగా నష్టపోయాడు. పంటల పెట్టుబడులకు, బోర్లు వేయడానికి తెచ్చిన అప్పులు రూ.14లక్షలకుపైగా అయ్యాయి. వాటికి వడ్డీ తీర్చేమార్గం లేకపోయింది. ఈ ఒత్తిడితో మంగళవారం రాత్రి తన సొంత వ్యవసాయ తోట వద్దకు వెళ్లాడు. అక్కడ తీవ్ర ఒత్తిడిలో ఉన్న రైతు అర్ధరాత్రి సమయంలో తాను తోటలో పురుగుల మందు తాగానని చిన్నాన్నకు ఫోన్‌ద్వారా తెలిపాడు. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన పొలం వద్దకు చేరుకుని చికిత్స నిమిత్తం ధర్మవరం ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం అనంతపురం, కర్నూలుకు తరలించారు. పరిస్థితి విషమించడంతో బెంగళూరుకు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. ఆయనకు భార్య అంజలి, కుమార్తె, కుమారుడు ఉన్నారు. మృతుడి తమ్ముడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

తలుపులలో...


వెంకటరమణ (ఫైల్)

కదిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): తలుపుల మండల కేంద్రానికి చెందిన ఎన్. వెంకటరమణ (48) అనే వ్యక్తి అప్పులబాధతో బుధవారం ఆత్మహత్య చేసుకున్నట్లు స్థానిక ఎస్ఐ నరసింహుడు తెలిపారు. ఎస్ఐ తెలిపిన మేరకు.. వెంకటరమణ బుధవారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో విషపు గుళికలు మింగి ఆత్మహత్య చేసుకున్నట్లు భార్య రత్నమ్మ ఫిర్యాదు చేసింది. ఆయనకు ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మూడు సంవత్సరాల కిందట పెద్ద కుమారుడు యశ్వంత్‌కు రోడ్డు ప్రమాదం జరిగి తీవ్రంగా గాయపడ్డాడు. వైద్యం కోసం దాదాపు 15 తులాల బంగారును బ్యాంకులో తాకట్టు పెట్టారు. సంవత్సరం కిందట వెంకటరమణ తల్లి మరణించింది. తాకట్టులో ఉన్న బంగారు వేలం వేస్తామని నోటీసులు ఇచ్చారు. అప్పులు ఎక్కువ కావడంతో తీవ్ర మనస్థాపానికి గురై విషపు గుళికలు మింగినట్లు ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

రైలు కిందపడి యువకుడు...

తాడిపత్రి, జూలై23(ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్ సమీపంలోని ఫ్లైఓవర్ వద్ద గుర్తుతెలియని యువకుడు (30) బుధవారం రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడని రైల్వే హెడ్‌కానిస్టేబుల్ వరప్రసాద్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. మృతుడి వద్ద చెన్నై సెంట్రల్ నుంచి కడప జనరల్ టికెట్ ఉందని, మిగతా వివరాలు ఏమి లేవని అన్నారు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉందని తెలిపారు.

24 మండలాల్లో వర్షం

అనంతపురం అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని 24 మండలాల్లో మంగళవారం వర్షం కురిసింది. అత్యధికంగా యల్లనూరులో 21.4 మి.మీ. వర్షపాతం నమోదయింది. గుంతకల్లులో 17.2 మి.మీ, వజ్రకరూరు 15.0, పామిడి 11.4, గుత్తి 11.2, విడపనకల్లు 8.2, పుట్లూరు 6.4, పెద్దవడుగూరు 6.2, అనంతపురం నగరం 5.2, డి.హిరేహాల్ 4.8, యాడికి, తాడిపత్రి 4.2, నార్పల 3.8, కూడేరు 3.2, కణేకల్లు, ఉరవకొండ, కణేకల్లు 3.0, ఆత్మకూరు 2.4, రాయదుర్గం, కళ్యాణదుర్గం, బొమ్మనహాల్ 2.0 మి.మీ వర్షపాతం నమోదయింది. మిగతా మండలాల్లో 2.0 మి.మీ లోపు వర్షం కురిసింది. బుధవారం అనంతపురం, కూడేరు, బొమ్మనహాల్, పుట్లూరు, యాడికి, గార్లదిన్నె, గుత్తి, పెద్దవడుగూరు తదితర మండలాల్లో చిరుజల్లులు పడ్డాయి.

టమోటా కిలో రూ.34

అనంతపురం రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో బుధవారం కిలో టామోటా గరిష్ఠంగా రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. కనిష్ఠంగా రూ.20, సరాసరి ధర రూ.26తో విక్రయాలు జరిగాయన్నారు.

చీనీ టన్ను రూ.17 వేలు

అనంతపురం నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో బుధవారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్ఠంగా 17,100తో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిం దు తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు. మార్కెట్‌కు మొత్తంగా 1095 టన్నుల చీనీకాయలు వచ్చినట్లు పేర్కొన్నారు.

వీరజవాన్ కుటుంబానికి సాయం


చెక్కును అందజేస్తున్న యోగా సిందూర్ బృందం

గోరంట్ల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కల్లితండాకు చెందిన వీరజవాన్ మురళీనాయక్ కుటుంబానికి యోగాసిందూర్ సంస్థ తరఫున రూ.లక్ష ఆర్థిక సాయం అందించారు. ఈ మేరకు బుధవారం జవాన్ తల్లిదండ్రులు శ్రీరామునాయక్, జ్యోతిబాయిలకు చెక్కును ఇచ్చారు. యోగా సింధూర్ బృందం కల్లితండాకు వెళ్లి జవాన్ కుటుంబాన్ని కలిసింది. త్యాగానికి సమానమైన మాటలు లేవని, తమ సహాయం వారి కుటుంబానికి, దేశప్రజల తరఫున తెలియచేసే కృతజ్ఞత అన్నారు. కార్యక్రమంలో యోగా సింధూర్ వ్యవస్థాపకుడు డాక్టర్ యోగా నారాయణ, కమిటీ అధ్యక్షుడు శివదుర్గాప్రసాద్, బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్ శరత్‌కుమార్‌రెడ్డితో పాటు పవన్‌కుమార్, ప్రవీణ్‌కుమార్, డాక్టర్ ధనుజయ్, రాధిక, దేవరాజుస్వామి, లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, చలం, శంకర్, సాయినాథ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటిలోగా అఫిడవిట్ దాఖలు చేయాలి

వ్యవసాయ శాఖకు హైకోర్టు ఆదేశం
వ్యవసాయ సహాయకుల పిటిషన్‌పై విచారణ రేపటికి వాయిదా



అనంతపురం అర్బన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): వ్యవసాయ సహాయకుల బదిలీలకు సంబంధించిన విచారణను హైకోర్టు ఈనెల 25వ తేదీకి వాయిదా వేసింది. శ్రీసత్యసాయి జిల్లాలోని 11 మంది, అనంతలో ఇద్దరు, కర్నూలులో 20 మంది, ప్రకాశం, చిత్తూరు జిల్లాకు చెందిన మరికొందరు వ్యవసాయ సహాయకులు తమకు బదిలీల్లో అన్యాయం జరిగిందని హైకోర్టును వేర్వేరుగా ఆశ్రయించారు. ఆయా జిల్లాల సిబ్బంది రిట్ పిటిషన్లపై హైకోర్టు వేర్వేరుగా స్టేటస్ కో ఆర్డర్లు జారీ చేసింది. ఆయా జిల్లాల సిబ్బందిది ఒకే సమస్య కావడంతో అందరి పిటిషన్లను కలిపి బుధవారం విచారణకు పిలిచింది. వ్యవసాయ శాఖ యంత్రాంగం కౌంటర్ (అఫిడవిట్) దాఖలు చేయలేదు. అఫిడవిట్‌ను గురువారం దాఖలు చేయాలని ఆదేశిస్తూ తదుపరి విచారణను శుక్రవారానికి హైకోర్టు న్యాయమూర్తి వాయిదా వేశారు.

కోర్టు ధిక్కారం తప్పదా..?

ఉమ్మడి అనంత జిల్లాకు సంబంధించి రైతు సేవాకేంద్రంలో పనిచేసే వ్యవసాయ సహాయకులకు గతనెల 28వతేదీ అనంత జేడీఏ కార్యాలయంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. తమకు మంచి ర్యాంకు ఉన్నా.. అడిగిన స్థానాలు కేటాయించకుండా అన్యాయం చేశారని బాధితులు వాపోతున్నారు. ఈ నేపథ్యంలో శ్రీసత్యసాయి జిల్లాకు చెందిన 11 మంది వ్యవసాయ సహాయకులు పలుమార్లు కలెక్టర్, జేడీఏలను కలిసి విన్నవించారు. ఈ నేపథ్యంలో ఈనెల 14వ తేదీన 11 మంది హైకోర్టులో రిట్ పిటీషన్ వేశారు. ప్రస్తుతం సిబ్బంది పనిచేస్తున్న స్థానాల్లోనే రెండు వారాలపాటు కొనసాగించాలంటూ ఈనెల 15న హైకోర్టు రిట్ పిటీషన్‌పై స్టేటస్‌కో ఆర్డర్ ఇచ్చింది. ఇదే క్రమంలో సంబంధిత న్యాయవాది తరఫున పిటిషన్ దాఖలు చేసిన సిబ్బంది ఈనెల 17వ తేదీన అనంత జేడీఏ కార్యాలయంలో కోర్టు ఆర్డర్‌ను అందజేసినట్లు సమాచారం. తమకు కోర్టు ద్వారా నేరుగా ఉత్తర్వులు రాలేదన్న కారణంతో సంబంధిత ఉన్నతాధికారులు పట్టించుకోలేదని సమాచారం. హైకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన రోజు నుంచి పిటిషన్ దాఖలు చేసిన సిబ్బంది స్థానాలు యథాతథంగా కొనసాగించేలా సంబంధిత ఎంపీడీఓలు, ఏడీఏలకు జేడీఏ కార్యాలయం నుంచి అధికారికంగా ఆర్డర్ పంపాల్సి ఉండగా... ఇప్పటిదాకా ఎలాంటి ఉత్తర్వులు జారీ చేయలేదని సమాచారం. ఈ నేపథ్యంలో కోర్టు ఉత్తర్వుల తర్వాత పటిషన్ దాఖలు చేసిన సిబ్బంది స్థానాల్లో కొత్త వారిని జాయిన్ చేసుకుని, పాత వారిని రిలీవ్ చేశారు. కర్నూలు జిల్లాలో పిటీషన్ దాఖలు చేసిన 20 మంది స్థానాలను యథాతథంగా కొనసాగించాలని ఆ జిల్లా జేడీఏ సంబంధిత ఎంపీడీఓలు, ఏడీఏలకు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పిటిషన్ దాఖలు చేసిన సిబ్బంది స్థానాలను మార్చలేదు. ఉమ్మడి అనంత జిల్లాలో అందుకు విరుద్ధంగా సంబంధిత అధికారులు వ్యవహరించడాన్ని బుధవారం హైకోర్టు జడ్జి దృష్టికి వ్యవసాయ సహాయకుల తరఫు న్యాయవాది తీసుకెళ్లినట్లు సమాచారం. శుక్రవారం విచారణలో ఈ విషయం నిరూపితమైతే కోర్టు ధిక్కారం కేసు నమోదు చేస్తామని జడ్జి స్పష్టం చేసినట్లు తెలిసింది. జిల్లా అధికారుల నిర్లక్ష్యం వారి మెడకు చుట్టుకునే అవకాశం ఉన్నట్లు ప్రచారం సాగుతోంది. ప్రస్తుతం కోర్టులో జరిగే పరిణామాలపై ఆ శాఖలో సర్వత్రా చర్చ సాగుతోంది.

ఆటోడ్రైవర్లకు సామాజిక బాధ్యత అవసరం

- ఎస్పీ రత్న


ఆటో డ్రైవర్ల వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి రూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్లు సామాజిక బాధ్యతతో మెలగాలని ఎస్పీ రత్న సూచించారు. పుట్టపర్తిలోని సాయిఆరామంలో బుధవారం ఆటోడ్రైవర్లకు భద్రత-బాధ్యత అనే అంశంపై అవగాహన సదస్సు, మెగా వైద్యశిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఎస్పీ మాట్లాడుతూ.. నిత్యం అన్నిప్రాంతాలకు వెళ్లే ఆటోడ్రైవర్ల దృష్టికి సమాజంలో జరిగే ఎన్నో ఘటనలు వస్తాయన్నారు. అసాంఘిక కార్యకలాపాలు, వాటికి పాల్పడే వారి సమాచారాన్ని పోలీసులకు అందించడంలో ముందుండాలని ఎస్పీ సూచించారు. అటోడ్రైవర్లు.. ప్రయణికులను భద్రంగా గమ్యస్థానాలకు చేర్చాలన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాలకు వచ్చే ఇతర రాష్ట్రాలు, దేశాల భక్తులతో మర్యాదగా మెలగాలని సూచించారు. నేరస్తుల సమాచారం ఇస్తే.. ఆటోడ్రైవర్లకు ప్రోత్సాహకాలు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఫైరోజ్‌బేగం, డీఎస్పీ విజయ్‌కుమార్, ఎంవీఐ వరప్రసాద్, పుట్టపర్తి, నల్లమాడ, కొత్తచెరువు, పుట్టపర్తి రూరల్ సీఐలు సునీత, నరేందర్‌రెడ్డి, మారుతీశంకర్, సురేష్‌కుమార్, ఎస్ఐలు, వందలమంది ఆటోడ్రైవర్లు పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలపై నిఘా పెంచాలి

- సౌత్‌సెంట్రల్ రైల్వే డీఐజీ ఎండీఎస్‌జెడ్ ఖాన్


మాట్లాడుతున్న సౌత్‌సెంట్రల్ డీఐజీ

అనంతపురం న్యూటౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): రైళ్లలో చోరీల నివారణకు మరింత నిఘా పెంచాల్సిన అవసరం ఎంతైన ఉందని సౌత్‌సెంట్రల్ రైల్వే డీఐజీ ఎండీఎస్ జెడ్ ఖాన్ సిబ్బందిని ఆదేశించారు. బుధవారం ఆయన అనంతపురం ఆర్పీఎఫ్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. అందులో భాగంగా పలు రికార్డులను పరిశీలించారు. పలు చోరీల కేసులో రికవరీ చేసిన సామగ్రికి సంబంధించిన రిజిష్టరు, వస్తువుల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రధానంగా విజిబుల్ పోలిసింగ్ ద్వారా చోరీలను అరికట్టడానికి అవకాశం ఉందన్నారు. అందుకు అనుగుణంగా తగిన చర్యలు చేపట్టాలని అన్నారు. పెట్రోలింగ్‌లో ఉన్న సిబ్బంది ప్రయాణికులతో మమేకం కావడం ద్వారా చోరీలకు పాల్పడేవారికి భయం వచ్చే అవకాశం ఉందని తెలిపారు. ఈ మధ్య కాలంలో రన్నింగ్‌లో ఉన్న రైళ్లపై రాళ్లు విసరడం, ప్రయాణికులను ఇబ్బంది పెట్టడం లాంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయని, వీటిపై మరింత నిఘా ఉంచాలని ఆదేశించారు. సమావేశంలో డివిజనల్ సెక్యూరిటీ కమిషనర్ ఆకాశ్ కుమార్ జెస్వాత్, సీఐ సుధాకర్‌రావు, ఎస్ఐ పవన్‌కుమార్‌రెడ్డి, ఏఎస్ఐలు మహమ్మద్ రఫీ, ప్రతాప్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

గూగూడు కుళ్లాయిస్వామి హుండీ చోరీ

ఆ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డు
సోషల్ మీడియాలో వైరల్


ట్రాక్టర్‌లో హుండీ

నార్పల, జూలై 23(ఆంధ్రజ్యోతి): మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన గూగూడు కుళ్లాయిస్వామికి భక్తులు సమర్పించిన కానుకలు వేసే హుండీ ఒకటి చోరీ జరిగినట్లు సీసీ కెమెరాలో రికార్డయింది. బ్రహ్మోత్సవాల్లో కుళ్లాయిస్వామి మకాన్‌లో ఉండే ఒక హుండీని దేవదాయ శాఖలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి ట్రాక్టర్ తీసుకువచ్చి తీసుకెళ్లాడు. అది సీసీ కెమెరాలో రికార్డు అయింది. ఇది సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. హుండీ మాయంపై దేవదాయ శాఖ అధికారి కీలక పాత్ర ఉందని సమాచారం. ఆ హుండీలో ఎన్ని లక్షల రూపాయల డబ్బు ఉందో అనేది గ్రామంలో చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై దేవదాయ శాఖ అధికారి శోభ విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. హుండీ చోరీ జరగలేదని, అనవసరమైన ఆరోపణలు చేస్తున్నారని అన్నారు. సీసీ కెమెరా గురించి విలేకరులు అడిగిన ప్రశ్నకు ఈఓ తడబడుతూ సమాధానం దాటవేశారు.

అర్జున్ టెండూల్కర్ సెంచరీ


అర్జున్ టెండూల్కర్


దత్తారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 23(ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీల్లో అర్జున్ టెండూల్కర్ సెంచరీ సాధించాడు. విజయనగరంలో జరుగుతున్న ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ సీనియర్ వన్డే రాష్ట్రస్థాయి ప్రాబబుల్స్ మ్యాచ్‌లో జిల్లాకు చెందిన అర్జున్ టెండూల్కర్ 90 బంతుల్లో 13 బౌండరీలు, 9 సిక్సర్లతో 115 పరుగులు చేశాడు. ఎంకే దత్తారెడ్డి 68 బంతుల్లో 10 బౌండరీలు, 3 సిక్సర్లతో 83 పరుగులు చేశాడు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన జిల్లా క్రీడాకారులను జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమ లింగారెడ్డి అభినందించారు.

పెనుకొండలో రేపు మెగా జాబ్‌మేళా

పెనుకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీకళాశాల ఆధ్వర్యంలో ఈనెల 25న మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేశవరావు, నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరిక్రిష్ణ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక పరిటాల డిగ్రీ కళాశాలలో ఉదయం 10గంటలకు నిర్వహించే జాబ్‌మేళాలో 12 బహుళ జాతి కంపెనీలు పాల్గొంటున్నాయని వివరించారు. అభ్యర్థులు పదో తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లమో, బీఫార్మసీ, ఎం.ఫార్మసీ, నర్సింగ్, డిగ్రీ, బీటెక్, పీజీ చదివి 18-35 సంవత్సరాల వయసు కలిగిన వారు అర్హులని తెలిపారు. మరిన్ని వివరాలకు 9966682246కు సంప్రదించాలన్నారు.

పంటల బీమా గడువు పొడిగింపు

ఈ నెల 31వరకూ అవకాశం
జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ


ఈ-క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఉమామహేశ్వరమ్మ

ఉరవకొండ, జూలై 23(ఆంధ్రజ్యోతి): పంటల బీమా గడువు ఈనెల 31వ తేదీ వరకూ పొడిగించారని, రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమామహేశ్వరమ్మ తెలిపారు. జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌లో ఇప్పటి వరకు 64వేల హెక్టార్లలో పంటలు సాగు అయినట్లు పేర్కొన్నారు. వజ్రకరూరు మండలం వీసీ ప్యాపిలి గ్రామంలో మోడల్ పల్స్ విలేజ్ కింద రైతులకు కంది విత్తనాలను పంపిణీ చేశారు. అనంతరం ఉరవకొండలో ఏడీఏ కార్యాలయంలో బుధవారం ఆమె మాట్లాడుతూ.. వీసీ ప్యాపిలి గ్రామాన్ని ఆదర్శ అపరాల్ల గ్రామం కింద ఎంపిక చేశామని తెలిపారు. పీజీఆర్ 176 రకం కందిని ఉచితంగా పంపిణీ చేశామని అన్నారు. జిల్లాలో 3.20 లక్షల హెక్టార్లకు గాను 64వేల హెక్టార్లలో మాత్రమే వేరుశనగ, కంది, పత్తి, పంటలు సాగు అయ్యాయని వివరించారు. వర్షపాతం 40 శాతం తక్కువ నమోదయిందన్నారు. ఉరవకొండ మండలంలోని చిన్నముష్టూరు, పెద్దముష్టూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ క్రాప్ బుకింగ్‌ను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మూలగారపల్లిలో ఎస్ఎంఈవో పథకం కింద విత్తనాలు తీసుకున్న పొలాల రైతులను సందర్శించారు. ఈ కార్యక్రమాల్లో ఏడీఏ సత్యనారాయణ, ఏవోలు రామకృష్ణ, మధుకర్, ఏఈవోలు భరత్, వెంకటనారాయణ పాల్గొన్నారు.

ప్రాణాలు తీసిన ప్రమాదాలు

ఇద్దరు విద్యార్థుల సహా నలుగురి మృతి

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు ప్రాంతాలలో జరిగిన రోడ్డు ప్రమాదాలలో బుధవారం నలుగురు మృతిచెందారు. వీరిలో ఇద్దరు విద్యార్థులు ఉన్నారు. వాహనాలు ఢీకొని ముగ్గురు, బైకు అదుపుతప్పి ఒకరు ప్రాణాలు కోల్పోయారు. దీంతో బాధిత కుటుంబాల్లో తీవ్ర విషాదం అలుముకుంది.


కన్నీరు మున్నీరవుతున్న అఖిల్ కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో అఖిల్ (ఫైల్)

ఇసుక ట్రాక్టర్ ఢీకొని విద్యార్థి దుర్మరణం

పరిగి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఊటకూరు గ్రామానికి చెందిన అఖిల్(17) అనే విద్యార్థి బుధవారం ఇసుక ట్రాక్టర్ ఢీకొని దుర్మరణం చెందాడు. ఊటకూరు గ్రామానికి చెందిన రుతుపర్ణ చక్రవర్తి, గంగాదేవి దంపతుల ఏకైక కుమారుడు అఖిల్ ద్విచక్రవాహనంలో హిందూపురంలోని శ్రీనివాస ఐటీఐ కళాశాల నుంచి స్నేహితుడు లోకేష్‌తో కలిసి స్వగ్రామానికి బయలుదేరాడు. శాసనకోట-జాతీయ రహదారి మధ్యలో పెన్నానది నుంచి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ బలంగా ఢీకొనడంతో అఖిల్ అక్కడికక్కడే మృతిచెందగా లోకేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. క్షతగాత్రుడు లోకేష్‌ను 108 సాయంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. లోకేష్ కూడా ఐటీఐ చదువుతున్నాడు. అఖిల్ తండ్రి పెయింటర్‌గా, తల్లి గార్మెంట్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలవడంతో వారి ఆర్తనాదాలు మిన్నంటాయి. ప్రమాదానికి కారణమైన ఇసుక ట్రాక్టర్‌ను పద్మసాయి పాఠశాల వద్ద ఆపి డ్రైవర్ పరారయ్యాడు. ట్రాక్టర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని..


ప్రమాదానికి కారణమైన బస్సు

సోమందేపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ బస్సు ఢీకొని సురేష్‌రెడ్డి (15) అనే విద్యార్థి దుర్మరణం పాలైన సంఘటన మండలంలోని వెలిదడకల వద్ద బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రాచపల్లి హైస్కూల్‌లో 10వ తరగతి చదువుతున్న సురేష్‌రెడ్డి హిందూపురం రూరల్ మండలం బాలంపల్లి నుంచి స్వగ్రామమైన గోరంట్ల మండలం బోయలపల్లికి సాయంత్రం ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. కదిరి నుంచి హిందూపురానికి వస్తున్న పల్లె వెలుగు ఆర్టీసీ బస్సు వెలిదడకల-పత్తికుంటపల్లి మధ్యలో ఢీకొనడంతో విద్యార్థి అక్కడికక్కడే మృతిచెందాడు. సురేష్‌రెడ్డి అమ్మమ్మ ఇంట్లో ఉంటూ చదువుకుంటున్నట్లు స్థానికులు తెలిపారు. బోయలపల్లిలో ఉన్న తాత అశ్వర్థరెడ్డిని కలవడానికి బయలుదేరినట్లు పేర్కొన్నారు. మార్గమధ్యంలో దుర్మరణం చెందడంతో కుటుంబ సభ్యులు రోదనలు మిన్నంటాయి. సంఘటనా స్థలానికి చేరుకున్నవారు బోరున విలపించడంతో స్థానికులను కంటతడిపెట్టించింది. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని రైతు..


బోయనల్లప్ప (ఫైల్)

గార్లదిన్నె, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని జంబులదిన్నె కొట్టాల సమీపంలో బుధవారం సాయంత్రం గుర్తు తెలియని వాహనం ఢీకొని బోయ నల్లప్ప (51) అనే రైతు దుర్మణం చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు.. జంబులదిన్నెకు చెందిన నల్లప్ప గత కొంతకాలం నుంచి సోములదొడ్డిలో నివాసం ఉంటున్నాడు. జంబులదిన్నె కొట్టాల సమీపంలో ఉన్న చీనీ తోటకు ప్రతిరోజూ వచ్చి వెళ్లేవాడు. అందులో భాగంగా బుధవారం చీనీ కాయలు కోయించి... బ్యాగులో కొన్ని కాయలు తీసుకుని ద్విచక్ర వాహనంలో బయలుదేరాడు. శింగనమల వైపు నుంచి గుర్తు తెలియని వాహనం అతి వేగంగా వచ్చి ద్విచక్ర వాహనంలో వెళుతున్న నల్లప్పను ఢీ కొట్టి వెళ్లిపోయింది. ప్రమాదంలో ఆయన అక్కడిక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు వాహనాన్ని పట్టుకునేందుకు ప్రయత్నించినా ఫలితం లేకపోయింది. ఎస్ఐ మహమ్మద్‌గౌస్‌బాషా సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. ప్రమాదంపై స్థానికులతో ఆరా తీశారు. మృతుడికి భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నారు. ప్రమాదానికి కారణమైన వాహనాన్ని పట్టుకునేందుకు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

బైక్ అదుపుతప్పి..

హిందూపురం, జూలై23(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు మండలంలోని 544-ఈ జాతీయ రహదారిపై బుధవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంజినప్ప(75) అనే వృద్ధుడు మృతిచెందారు. ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపిన మేరకు, దేమకేతేపల్లి ఎస్సీ కాలనీకి చెందిన అంజినప్ప తన అల్లుడి బైక్‌పై చిలమత్తూరు నుంచి స్వగ్రామానికి బయలుదేరాడు. తుమ్మలకుంట సమీపంలో బైకు అదుపు తప్పి కింద పడ్డారు. దీంతో తీవ్రంగా గాయపడిన అంజినప్ప అక్కడికక్కడే మృతి చెందారు.

ఇద్దరు యువతుల అదృశ్యం

కదిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇద్దరు యువతులు బుధవారం అదృశ్యమయ్యారు. పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపిన మేరకు, అడపాల వీధికి చెందిన 19 ఏళ్ల యువతి హైదరాబాదులో నర్సింగ్ చేస్తోంది. రెండు రోజుల కిందట కదిరికి వచ్చింది. మంగళవారం మధ్యాహ్నం ఇంట్లో ఎవరికి చెప్పకుండా బయటకు వెళ్లింది. యువతి తల్లి బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. గొల్లమ్మ మండపం వీధిలో మరో యువతి బుధవారం అంగడికి అని వెళ్లి తిరిగి రాలేదు. యువతి తండ్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. రెండు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

మహిళల ఆరోగ్య సంరక్షణే ప్రభుత్వ లక్ష్యం

ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ



వైద్యసేవలపై మహిళలను ఆరాతీస్తున్న రాయపాటి శైలజ

అనంతపురం వైద్యం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మహిళల ఆరోగ్య సంరక్షణే కూటమి ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజ పేర్కొన్నారు. జిల్లాకేంద్రానికి బుధవారం వచ్చిన ఆమె స్థానిక స్థానిక సర్వజన వైద్యశాలను సందర్శించారు. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్, గైనిక్ విభాగాధిపతి డాక్టర్ షంషాద్ బేగం, అడ్మినిస్ట్రేటర్ మల్లికార్జునరెడ్డి స్వాగతం పలికారు. తర్వాత ఆమె.. గైనిక్, లేబర్ తదితర వార్డులను పరిశీలించి ప్రభుత్వ వైద్యసేవల గురించి అక్కడి మహిళలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అధునాతన వైద్యసేవలు అందిస్తున్నామని తెలిపారు. అలాగే వన్‌స్టాప్ సెంటర్(సఖి)కెళ్లి మహిళలకు అందుతున్న సేవలను ఆరాతీశారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు, ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

మానవ మృగాలను కఠినంగా శిక్షించాలని వినతి

అనంతపురం వైద్యం, జూలై 23(ఆంధ్రజ్యోతి): మహిళలు, బాలికలపై అత్యాచారాలు, హత్యలకు పాల్పడుతున్న మానవ మృగాలను తక్షణమే కఠినంగా శిక్షించాలని ఎస్సీ, ఎస్టీ సంఘాల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు సాకే హరి కోరారు. ఈ మేరకు బుధవారం ఆయన జిల్లాకేంద్రానికి వచ్చిన రాష్ట్ర మహిళా కమిషన్ చైర్‌పర్సన్ రాయపాటి శైలజను కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఇటీవల ఉమ్మడి అనంత జిల్లాలో బాలికలపై, మహిళలపై జరిగిన అఘాయిత్యాలను వివరించారు. ఇప్పటికే జిల్లాలో 250 పోక్సో కేసులు నమోదైనప్పటికీ బాలికలకు రక్షణ కరువైందన్నారు. ఇప్పటికైనా మానవమృగాలను కఠినంగా శిక్షించాలని కోరారు. నాయకులు రామకృష్ణ, శశికుమార్, గోపాల్‌కృష్ణ, నరేంద్ర, రాము, అక్రమ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

మండల సమావేశంలో సమస్యలపై చర్చ

గార్లదిన్నె, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఎంపీపీ వెంకటనారాయణ అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఇందులో ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులతో చర్చించారు. అనంతరం కో ఆప్షన్ మెంబర్ యూనిస్ మాట్లాడుతూ.. ఇదివరకే పలు సమస్యల్ని అధికారుల దృష్టికి తెచ్చామని, అయితే ఇంతరవకు పరిష్కరించలేదని వాపోయారు. సమస్యల్ని పరిష్కరించలేనప్పుడు ఇక ఈ సమావేశాలు ఎందుకని ప్రశ్నించారు. ఇప్పటికైనా సమస్యల్ని త్వరగా పరిష్కరించాలని కోరారు. వైస్ ఎంపీపీ కుంచం రామ్మోహన్‌రెడ్డి, తహసీల్దార్ బండారు ఈరమ్మ, ఎంపీడీఓ యోగానందరెడ్డి, ఈఓఆర్డీ దామోదరమ్మ, ఎంపీటీసీ సభ్యులు రామచంద్ర, విశ్వనాథ్, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

కార్మిక రాజ్య స్థాపనకు ఏకం కండి: బీఎంఎస్



తిలక్ విగ్రహానికి పూలమాల వేస్తున్న బీఎంఎస్ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 23(ఆంధ్ర జ్యోతి): కార్మిక రాజ్యస్థాపనకు దేశంలోని కార్మికులంతా ఏకమవ్వాలని భారతీయ మజ్దూర్‌సంఘ్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ బీఎల్ నరసింహులు పిలుపునిచ్చారు. భారతీయ మజ్దూర్ సంఘ్ ఆవిర్భావ దినం సందర్భంగా బుధవారం స్థానిక లోకమాన్య బాలగంగాధర్ తిలక్ విగ్రహానికి బీఎంఎస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం బీఎల్ నరసింహులు మాట్లాడుతూ స్వరాజ్యం నా జన్మ హక్కు అనే నినాదంతో భారత స్వాతంత్ర్యపోరాటాన్ని మలుపుతిప్పిన మహనీయుడు బాల గంగాధర్‌తిలక్ అని పేర్కొన్నారు. రాజకీయాలకతీతంగా కార్మిక హితం కోసం పనిచేస్తున్న జాతీయవాద కార్మికసంఘాన్ని తిలక్ స్థాపించారని తెలిపారు. ఆయన స్ఫూర్తితో దేశ కార్మికులంతా ఒకతాటిపైకి వచ్చి కార్మికరాజ్యం స్థాపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాణిక్యం, లక్ష్మయ్య, లాలెప్ప, కృష్ణమూర్తి, జయప్ప, గణేష్, మహేష్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

తరిమెల నాగిరెడ్డి ఆశయాలను కొనసాగిస్తాం

గార్లదిన్నె, జూలై 23 (ఆంధ్రజ్యోతి): కమ్యూనిస్టు యోధుడు తరిమెల నాగిరెడ్డి ఆశయాలను కొనసాగిస్తామని ఏఐకేఎంఎస్ మండల కార్యదర్శి రాజశేఖర్‌శెట్టి పేర్కొన్నారు. తరిమెల నాగిరెడ్డి 49వ వర్ధంతి సభకు సంబంధించిన పోస్టర్లను బుధవారం ఆయన మండలకేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాగిరెడ్డి తరిమెల గ్రామంలోని భూస్వాముల కుటుంబంలో జన్మించినా.. భూస్వాములకు వ్యతిరేకంగా నిలచి పేదలకు భూములు పంచారన్నారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామన్నారు. నాయకులు సాంబశివారెడ్డి, పొన్నూరు ప్ప, శివారెడ్డి, పీరా, రామాంజినేయులు తదితరులు పాల్గొన్నారు.

సమాచార హక్కు చట్టంపై అవగాహన

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక జిల్లా సహకార శాఖ కార్యాలయంలో సమాచార హక్కు చట్టంపై బుధవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో జిల్లా సహకార శాఖ అధికారి (డీసీఓ) అరుణకుమారి మాట్లాడుతూ సమాచార హక్కుపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జారీ చేసిన ఉత్తర్వులను సక్రమంగా అమలు చేయాలని తెలిపారు. ప్రజలు అడిగిన సమాచారాన్ని అందించి పారదర్శక రికార్డులు నిర్వహణ, పాలనకు సహకరించాలని కోరారు. ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు అల్తాఫ్, ఉపాధ్యక్షుడు సుబ్బరాయుడులు సమాచార హక్కు చట్టం విధివిధానాలు, అమలుతీరుతెన్నులపై వివరించారు. అధికారుల ప్రశ్నలను నివృత్తి చేశారు. జిల్లా సహకార శాఖ అసిస్టెంట్ రిజిస్ట్రార్‌లు బాలగంగాధర్, మునికృష్ణారెడ్డి, శివమ్మ, రవి, శ్రీనివాసులు, నాగభూషణరెడ్డి పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

అనంతపురంరూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురుగుంట, నజ్జలకాలువ గ్రామాల్లోని రైతుసేవాకేంద్రాల్లో బుధవారం పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఓ వెంకట్‌కుమార్ హాజరై గ్రామాల్లో ఉద్యాన పంటలు, ఇతరాత్ర పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో సమావేశమై మాట్లాడారు. పంటలకు సోకే తెగుళ్లు, వాటి నివారణకు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఉద్యాన విస్తరణ అధికారి శ్రీనివాసులు, వ్యవసాయ విస్తరణ అధికారి భాగ్యశ్రీ, ఉద్యాన సహాయకులు లోకేశ్వరి, ఎంపీఈఓలు అనుపమ, నిర్మల తదితరులు పాల్గొన్నారు.

● శింగనమల: మండలకేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోందిని నిర్వహించారు. జిల్లా వనరుల కేంద్రం ఏఓ నరసింహులు, మండల వ్యవసాయాధికారి ఏఓ అన్వేష్‌కూమార్ పాల్గొని పంటల సాగుపై రైతులకు పలు సూచనలు చేశారు. అలాగే సమాచార హక్కు చట్టం 2005పై అవగహన కల్పించారు. వ్యవసాయశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

● రాప్తాడు: బొమ్మేపర్తి,గొందిరెడ్డిపల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఏఓ కృష్ణచైతన్య రైతులతో సమావేశమై పంటలకు తెగుళ్ల వ్యాపించినప్పుడు చేపట్టాల్సిన చర్యలను వివరించారు. పంటల బీమాకు రైతులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. సర్పంచ్ శీనయ్య, ఎంపీటీసీ జాఫర్, ఏఈఓలు రంజిత, సుజిత, వీహెచ్ఏ భార్గవ, ఎంపీఈఓ ధనలక్ష్మి, రేష్మ, రైతులు పాల్గొన్నారు.



రాప్తాడు మండలం బొమ్మేపర్తిలో రైతులతో సమావేశమైన వ్యవసాయాధికారులు

అభివృద్ధికి అడుగులు

● మైనార్టీ కాలనీలో రూ.87 లక్షలతో పనులు
● 20 ఏళ్ల తరువాత సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం

రాప్తాడు, జూలై 23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం వచ్చిన ఏడాది కాలంలోనే అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో రాప్తాడు పంచాయతీలోని ముస్లిం మైనార్టీ కాలనీ వాసులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాలనీలో సీసీ రోడ్లు, మురుగు కాల్వలు నిర్మించి ప్రజలకు సౌకర్యాలు కల్పిస్తున్నారు. ఎన్నో ఏళ్ల తరువాత ఇళ్ల ముందు సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మిస్తున్నారని కాలనీవాసులు తెలిపారు. పంగల్ రోడ్డు సమీపంలో 20 ఏళ్ల క్రితం మైనార్టీ కాలనీ ఏర్పడింది. అప్పటి ప్రభుత్వం పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసి కాలనీ ఏర్పాటు చేసింది. కాలక్రమేణా పేదలు ఇళ్లు నిర్మించుకున్నారు. ప్రస్తుతం మైనార్టీ కాలనీలో 400 కుటుంబాలు నివాసం ఉంటున్నాయి. సీసీ రోడ్లు లేకపోవడంతో వర్షాకాలంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సీసీ రోడ్లు నిర్మించాలని విన్నవించినా ఎవరూ పట్టించుకోలేదు. వైసీపీ ప్రభుత్వంలో ఒక్క సీసీ రోడ్డు కూడా వేయలేదు. 2024లో ఎన్నికల ప్రచారంలో పరిటాల సునీత కాలనీకి వెళ్లినప్పుడు సీసీ రోడ్లు నిర్మించాలని స్థానికులు విన్నవించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో మొదటి విడతలో రూ. 56 లక్షలతో సీసీ రోడ్లు, డ్రైనేజీ నిర్మించారు. రెండో విడతలో రూ. 31 లక్షలతో డ్రైనేజి నిర్మించారు. రెండు విడతల్లో మొత్తం రూ. 87 లక్షలతో రోడ్లు, డ్రైనేజి కాలువలు నిర్మించారు. కాలనీలో ప్రధాన దారిలో ఇరువైపులా డ్రైనేజి, వీదుల్లో సీసీ రోడ్లు నిర్మించారు. ఎన్నో ఏళ్ల తరువాత కాలనీలో అభివృద్ధి పనులు చేయడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మైనార్టీ కాలనీలో నిర్మించిన సీసీ రోడ్డు, మురుగు కాలువ

మా ఇంటి ముందు రోడ్డేశారు



ఆరేళ్ల నుంచి కాలనీలోని ఇంట్లో మేము నివాసం ఉంటున్నాం. ఇన్నాళ్లు మా కాలనీలో సీసీ రోడ్లు లేవు. వర్షాలు వస్తే నీరంతా ఇంటి ముందు నిలిచి బురదమయంగా ఉండేది. కాలనీ వాసులందరూ రాకపోకలకు ఎంతో ఇబ్బంది పడ్డారు. ఇటీవలే మా ఇంటి ముందు సీసీ రోడ్డు నిర్మించారు. కాలనీ వాసులు అందరూ సంతోషపడుతున్నారు.

-షాహినా, మైనార్టీ కాలనీ

కాలనీ ఏర్పడినప్పటి నుంచి రోడ్లు లేవు



మైనార్టీ కాలనీ దాదాపు 20 ఏళ్ల క్రితం ఏర్పడింది. అప్పటి నుంచి సీసీ రోడ్లు లేవు. మేము 12 ఏళ్ల నుంచి కాలనీలో మా ఇంట్లో నివాసం ఉంటున్నాం. జిల్లా కేంద్రానికి దగ్గరగా ఉన్నా కనీసం రోడ్లు, డ్రైనేజీలు కూడా లేక ఇంతకాలం ఇబ్బంది పడ్డాం. వర్షాకాలం వచ్చిందంటే మా అవస్థలు చెప్పేవి కావు. ఇటీవలే మా కాలనీలో సీసీ రోడ్లు నిర్మించారు.

-అమానుల్లా, మైనార్టీ కాలనీ

భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు



కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఎమ్మెల్యే పరిటాల సునీత రెండు విడుతల్లో సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి రూ. 87 లక్షలు మంజూరు చేశారు. పనులు పూర్తి చేశాం. రానున్న రోజుల్లో ఎమ్మెల్యే పరిటాల సునీత మైనార్టీ కాలనీలో మరిన్ని అభివృద్ధి పనులు చేయించనున్నారు.

-తిరుపాలు, సర్పంచ్, రాప్తాడు

ఏడాదిలోనే ఎంతో అభివృద్ధి చేశాం

● సుపరిపాలనలో తొలిఅడుగులో ఎమ్మెల్యే పరిటాల సునీత



సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న పరిటాల సునీత

ఆత్మకూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): అధికారంలోకి వచ్చిన ఏడాదిలో నే ఎన్నో అభివృద్ధి పనులు చేశామని ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. మండల కేంద్రంలో బుధవారం నిర్వహించిన సుపరిపాలనలో తొ లిఅడుగు కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా టీడీపీ శ్రేణులతో కలిసి ఇంటింటికీ తిరిగి ఏడాదిపాలనలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరించారు. అలాగే కరపత్రాలు పంపిణీ చేశారు. తర్వాత స్థానిక భగత్‌సింగ్ కాలనీ, జయరాం కాలనీలలో రూ. 50లక్షలా 30వేల వ్యయంతో నిర్మించి సీసీరోడ్లను ప్రారంభించారు. అలాగే వ్యవసాయశాఖ ద్వారా రైతులకు ఉచిత విత్తన కందులను పంపిణీ చేశారు. మహిళా సంఘాల సభ్యులకు రూ.2కోట్ల రుణాల చెక్కులను అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. ఏడాదిలోనే నియోజకవర్గంలో ఎంతో అభివృద్ధి చేశామన్నారు. ముఖ్యంగా మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి సొంత మండలమైన ఆత్మకూరులో ఎన్నడూ లేనివిధంగా అభివృద్ధి పనులు చేశామన్నారు. ఒక్క రోడ్ల నిర్మాణానికే రూ.12 కోట్లు ఖర్చు చేశామన్నారు. అయితే గత వైసీపీ ప్రభుత్వంలో తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి సొంత మండలానికి ఏమి చేశారో చెప్పాలని సవాల్ విసిరారు. అభివృద్ధి చేయకపోగా.. అరాచకం చేశారని మండిపడ్డారు. నాయకులు, కార్యకర్తలు పూలబొకేలకు బదులు అందజేసిన నోటుపుస్తకాలను ఆమె స్థానిక కేజీబీవీలో విద్యార్థినులకు అందజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ

మండలంలోని ఆరుగురి లబ్ధిదారులకు సీఎంరిలీఫ్ ఫండ్ 15.20లక్షలు మంజూరైంది. వారికి అందుకు సంబంధించిన చెక్కులను మండలకేంద్రంలో పరిటాల సునీత అందజేశారు. టీడీపీ మండల ఇన్‌చార్జి బాలాజీ, జిల్లా నాయకులు సుబ్రహ్మణ్యం, అనిల్‌చౌదరి, టీఎన్ఎస్ఎఫ్ ప్రధానకార్యదర్శి పరుశురామ్, మండల ప్రధాన కార్యదర్శి నరసింహ చౌదరి, ఎంపీటీసీ సభ్యురాలు పారిజాతమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జిలు క్రిష్ణమోహన్ చౌదరి, వెంకటనారాయణ, మండల నాయకులు శ్రీనివాస రెడ్డి, సూరి, రవీంద్రారెడ్డి, ప్రభాకర రెడ్డి, కందుల ఓబుళపతి , లక్ష్మీదేవి, సరళ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఇళ్ల స్థలాలు...!

అనంతపురం క్రైం: గ్రామీణ ప్రాంతాల్లో అర్హులందరికీ 3 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తామని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత పేర్కొన్నారు. అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో ఆమె టీడీపీ ధర్మవరం నియోజకవర్గ ఇన్‌చార్జి పరిటాల శ్రీరామ్‌తో కలిసి ఆర్డీఓ కేశవనాయుడు, హౌసింగ్ అధికారులు, ఆత్మకూరు, అనంతపురం రూరల్, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో హౌసింగ్‌పై సమీక్ష చేశారు. ఎన్టీఆర్ హౌసింగ్ వెరిఫికేషన్‌పై, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన- బీఎల్‌సీ హౌసింగ్ కార్యక్రమాలపై ఆరా తీశారు. 2016-2019 మధ్య పెండింగ్‌లో ఉన్న ఇళ్ల వివరాలు, 2021-2024 మధ్య మంజూరైన ఇళ్లు ఎన్ని పూర్తయ్యాయి...?, ఎన్ని నిర్మాణంలో ఉన్నాయి..? అంటూ ఆరా తీశారు. తర్వాత మాట్లాడుతూ... కొత్త ప్రభుత్వ నిబంధనల మేరకు గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న వారికి 3 సెంట్ల ఇళ్ల స్థలాలు ఇస్తున్నట్టు తెలిపారు. ఇందు కోసం ఎక్కడెక్కడ ప్రభుత్వ స్థలాలు ఉన్నాయి..? ప్రైవేట్ స్థలాలు ఎక్కడ తీసుకోడానికి అవకాశం ఉందో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఇళ్లు లేని అర్హుల వివరాలు సేకరించాలని ఆమె సూచించారు.

ఎట్టకేలకు.. మడుగును తొలగించారు



కొడిమిలో నీటిని తొలగించాక ఇలా..

ఆంధ్రజ్యోతి స్పందన

అనంతపురంరూరల్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొడిమిలోని మడుగును ఎట్టకేలకు తొలగించారు. మూడురోజులుగా జరుగుతున్న ఈ ప్రక్రియకు బుధవారం ముగింపు పలికార మండల అధికారులు. దీంతో గ్రామంలో నీటి నిల్వ అయ్యే సమస్య నుంచి గ్రామప్రజలకు, వాహనదారులకు ఉపసమనం లభించినట్లయింది. ఈనెల 21న కొడిమిలో మడుగు శీర్షిక ఆంధ్రజ్యోతి స్థానిక పరిస్థితి వివరిస్తూ కథనం ప్రచురించింది. ఈనేపథ్యంలో ఎమ్మెల్యే పరిటాల సునీతతోపాటు జిల్లా ఉన్నాతాధికారులు స్పందించారు. ఈ క్రమంలో మండల అధికారులను అప్రమత్తం చేశారు. దీంతో 21వతేదీ మధ్యాహ్నం నుంచి మడుగు తొలగింపు ప్రక్రియను అధికారులు చేపట్టారు. మురుగునీరు, వర్షపు నీటిని తొలగించేందుకు తాత్కాలిక కాలువ ఏర్పాటు పనులు ప్రారంభించారు. అయితే స్థానికంగా ఇద్దరు భూ యజమానులు పనులకు అడ్డుపడటం జరిగింది. దీంతో పనులు ఆరోజు నిలిచిపోయాయి. మండల అధికారులు, పోలీసులు గ్రామప్రజలకు, రైతులకు సర్ధిచెప్పి బుధవారం మళ్లీ కాలువతీత పనులను ప్రారంభించి పూర్తి చేశారు. దీంతో గ్రామ నడివీధిలో నిలిచిన నీరు తొలగిపోయింది. పరిస్థితి సాధారణ స్థితికి చేరుకుంది.

ఘనంగా మాస శివరాత్రి పూజలు



అనంతేశ్వరస్వామికి అభిషేకం చేస్తున్న భక్తులు

అనంతపురం టౌన్, జూలై 23 (ఆంధ్రజ్యోతి): నగర శివారు శారదానగర్‌లోని శివబాలయోగి ఆశ్రమంలో బుధవారం సాయంత్రం మాస శివ రాత్రి పూజలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో అనంతేశ్వరస్వామికి భక్తుల చేతులమీదుగా పంచామృతాభిషేకాలు చేశారు. అలాగే వేదపండితులు వేద మంత్రోచ్ఛారణల నడుమ ప్రత్యేక అలంకరణలు, విశేష పూజలు నిర్వహించారు. తర్వాత మహామంగళహారతి ఇచ్చి భక్తులకు తీర్థ ప్రసాదాల వితరణ చేశారు. ఆలయ కార్యవర్గం, భక్తులు పాల్గొన్నారు.

డిప్యూటీ ఎంపీడీఓ బాధ్యతల స్వీకరణ

శింగనమల, జూలై23(ఆంధ్రజ్యోతి): మండలకేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో డిప్యూటీ ఎంపీడీఓగా వినోద్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుమునుపు డిప్యూటీ ఎంపీడీఓ మురళీకృష్ణ రాయదుర్గంకు బదిలీ అయ్యారు. దీంతో ఆ స్థానంలోకి అనంతపురం డీఎల్పీ కార్యాలయంలో పని చేస్తున్న వినోద్‌కుమార్‌ను నియమించగా.. ఆయన బాధ్యతలు చేపట్టారు.

రైతులకు విత్తన కందుల పంపిణీ



రైతులకు కందులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కనగానపల్లి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నేషనల్ ఫార్మ్ సీడ్ మిషనరీ పథకం ద్వారా ఉచితంగా అందజేసిన విత్తన కందులను మండలకేంద్రంలో బుధవారం డీసీఎంఎస్, రాప్తాడు మార్కెట్ యార్డు చైర్మన్లు నెట్టెం వెంకటేష్, సుధాకర్ చౌదరి అర్హులైన రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఓ మాధవి, టీడీపీ మండల కన్వీనర్ యాతం పోతలయ్య, నాయకులు బిల్లే దాము, రాజాకృష్ణ, బట్టా సురేష్‌చౌదరి, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

న్యాయంగా గెలవలేకే పల్లెపై ఆరోపణలు

అనంతపురం వైద్యం, జూలై 23(ఆంధ్రజ్యోతి): చట్ట పరమైన ప్రక్రియలో న్యాయాన్ని గెలవలేకనే మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డిపై ఆదినారాయణ యాదవ్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని గ్లోబల్ హార్టికల్చర్ డైరెక్టర్ ప్రభాకర్ యాదవ్ పేర్కొన్నారు. నగరంలోని ప్రైవేట్ మీటింగ్‌హాల్లో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గ్లోబల్ హార్టికల్చర్ ప్రైవేట్ లిమిటెడ్ డైరెక్టర్లుగా తనతోపాటు ఆదినారాయణ యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, వై.అరుణమ్మ ఉన్నారన్నారు. 2017లో 160 ఎకరాల భూమిని తనకు ఆదినారాయణ యాదవ్, విష్ణువర్ధన్‌రెడ్డి, పల్లె రఘునాథరెడ్డి, వై.అరుణమ్మ విక్రయించారన్నారు. అందుకు రెజ్యులేషన్ పాస్‌చేసి హక్కును కల్పించారన్నారు. ఈ ఆధారంగా మూడో పార్టీకి భూమిని అమ్మిన తరువాత అగ్రిమెంట్ ఇచ్చానన్నారు. కొనుగోలుచేసిన వారికి ఇబ్బందుల్లేకున్నా ఆదినారాయణ యాదవ్‌కు సమస్య ఏంటని ప్రశ్నించారు. ఈ విషయంపై న్యాయస్థానాన్ని ఆశ్రయించడంతో స్టే ఇచ్చిందని వివరించారు. ఇప్పటికైనా న్యాయస్థానాలను తప్పుదోవపట్టించేలా అసత్య ఆరోపణలు చేయడం మానుకోవాలని హితవుపలికారు. గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ నాయక్ పాల్గొన్నారు.

చేనేత కార్మికులను ఆదుకోండి: సీపీఐ

అనంతపురం విద్య, జూలై23(ఆంధ్రజ్యోతి): చేనేత కార్మికులకు ఇచ్చినహామీలను అమలుచేసి ఆదుకోవాలని సీపీఐ నాయకులు కోరారు. ఈ మేరకు స్థానిక జిల్లా చేనేత శాఖ కార్యాలయం వద్ద బుధవారం చేనేత కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. నాయకుడు శ్రీరాములు మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం చేనేతలకు ఏడాదికి రూ24వేలు అందించేదన్నారు. కూటమి రూ36వేలు ఇస్తామని హామీ ఇచ్చిందని, కానీ అమలు చేయకపోవడం బాధాకరమని అన్నారు. చేనేతమగ్గాలకు 200యూనిట్ల ఉచిత కరెంట్ హామీ కూడా అమలుకాలేదన్నారు. వెంటనే కూటమి సర్కారు ఇచ్చినహామీలను అమలు చేసి చేనేత కార్మికులను ఆదుకోవాలని కోరారు. అనంతరం చేనేత శాఖ జేడీని వినతి పత్రం అందజేశారు. నాయకులు గోవిందప్ప, అల్లీపీరా, కార్మికులు మల్లికార్జున, ఎర్రిస్వామి, చంద్రశేఖర్, భార్గవ, వెంకటరమణ, సూర్యనారాయణ పాల్గొన్నారు.

ముగిసిన చిన్నపీర్ల పండగ

● పీర్ల తుది దర్శనానికి భారీగా తరలివచ్చిన భక్తులు

అనంతపురం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలో వేణుగోపాల్‌నగర్‌లో ఈనెల 12వ తేదీ నుంచి నిర్వహిస్తున్న చిన్నపీర్ల పండుగ బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఉత్సవాల ముగింపు నేపథ్యంలో బీబీ ఫాతిమా, అల్లావలి, అంగార్‌వలి, ఇమామ్ హసేన్, ఇమామ్ హుసేన్ పీర్ల తుదిదర్శనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు వందలాదిగా తరలివచ్చి పీర్లను తుదిదర్శనం చేసుకున్నారు. అనంతరం పీర్ల పెట్టెకు చదివింపులు చేసి మకానంకు చేర్చారు. కార్యక్రమంలో బ్రహ్మోత్సవ కమిటీ అధ్యక్షుడు కందుకూరి నాగరాజు, ఉపాధ్యక్షుడు జెబీవుల్లాఖాన్, కార్యదర్శి మొహమ్మద్ రఫీ, సభ్యులు పాల్గొన్నారు.



పీర్ల తుదిదర్శనం చేసుకుంటున్న భక్తులు

ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలి



ర్యాలీ నిర్వహిస్తున్న గ్రామస్థులు, విద్యార్థులు

రామగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి అనంత జిల్లాలో పేదలకు ఎన్నో సేవలందిస్తున్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని కోరుతూ మండలంలోని పోలేపల్లిలో గ్రామపెద్దలు, విద్యార్థులు, ఎమ్మార్పీఎస్ నాయకులు బుధవారం ర్యాలీ నిర్వహించారు. స్థానిక పోస్టాఫీస్ వరకు ర్యాలీ చేపట్టి అనంతరం అందరూ కలిసి తమ విన్నపాన్ని పోస్టుకార్డు ద్వారా కేంద్రప్రభుత్వానికి పంపారు. తర్వాత మానవహారంగా ఏర్పడి సేవ్ ఆర్డీటీ, ఎఫ్‌సీఆర్ఏను రెన్యూవల్ చేయాలని నినాదాలు చేశారు. మాజీ సర్పంచ్ చంద్రప్ప, ఎమ్మార్పీఎస్ నాయకులు కుంటిమద్ది ఓబులేశు, శ్రీరాములు, శీనా, నారాయణ, ముత్యాలు, మల్లికార్జున, ప్రసాద్, అంజి పాల్గొన్నారు.

నాయి బ్రాహ్మణుల సమావేశం

రామగిరి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని పేరూరులో బుధవారం నాయిబ్రాహ్మణుల సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఆ కుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు హాజరై మాట్లాడారు. నాయీబ్రాహ్మణులకు ఎక్కడైనా ఏవైనా సమస్యలు తలెత్తితే ఐకమత్యంతో పరిష్కరించుకోవాలని తెలిపారు. మా దృష్టికి తీసుకొచ్చినా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. త్వరలో మండలాల కమిటీలను ఎంపిక చేయనున్నట్లు చెప్పారు. నాయిబ్రాహ్మణ సంఘం నాయకులు శివ, మురళి, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన స్వామిదాస్



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న స్వామిదాస్

అనంతపురంక్రైం, జూలై 23(ఆంధ్రజ్యోతి): సీఎం చంద్రబాబును టీడీపీ క్రిస్టియన్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు ఈటె స్వామిదాస్ కలిశారు. అమరావతిలో బుధవారం ఆయన సీఎంను కలిసి మాట్లాడారు. క్రైస్తవులకు స్వయంఉపాధి సబ్సిడీ రుణాలు, విదేవీ విద్య, పాస్టర్లకు గౌరవవేతనం విడుదలపై కృతజ్ఞతలు తెలిపారు. తర్వాత పలు సమస్యలను వివరించి వినతి పత్రం అందజేశారు. రాష్ట్రంలో ఉన్న పాస్టర్లు, క్రైస్తవులకు సంక్షేమ పథకాలు, సబ్సిడీ రుణాలు అందించి ఆదుకుంటామని సీఎం భరోసా ఇచ్చినట్లు స్వామిదాస్ పేర్కొన్నారు.

వేధించేందుకే మిథున్‌రెడ్డి అరెస్టు: మేయర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 23(ఆంధ్రజ్యోతి): వేధించేందుకే వైసీపీ ఎంపీ మిథున్‌రెడ్డిని అక్రమ అరెస్టు చేశారని నగర మేయర్ మహమ్మద్ వసీం ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి నేతలు అంబేడ్కర్ రాజ్యాంగానికి తిలోదకాలు ఇచ్చి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా వైసీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. వైసీపీ హయాంలో ప్రభుత్వ అధీనంలోనే మద్యం షాపులు నడిచాయని, అలాంటప్పుడు స్కామ్‌కు ఆస్కారమెక్కడుందని ప్రశ్నించారు. కేవలం వేధించడానికే అక్రమ అరెస్టులు చేయిస్తున్నారని మండిపడ్డారు. నాయకులు సైపుల్లా బేగ్, కాగజ్ ఘర్ రిజ్వాన్, కుమార్ తాజ్, ఫయాజ్, కొర్రపాడు హుస్సేన్ పీరా తదితరులు పాల్గొన్నారు.

దళిత ద్రోహి ఎంఎస్ రాజు

● వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ విమర్శ

అనంతపురం కలెక్టరేట్, జూలై 23(ఆంధ్రజ్యోతి): మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్‌రాజు దళిత ద్రోహి అని వైసీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు సాకే చంద్రశేఖర్ విమర్శించారు. నగరంలోని పార్టీ జిల్లా కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లా పరిధిలో ఓ బాలికపై లైంగిక దాడి జరిగి నెలరోజులైనా హెల్త్ బులెటిన్‌ను విడుదల చేయలేదన్నారు. బాలికకు న్యాయం చేయాలని తాము డిమాండ్ చేస్తే ఇందుకు మమ్మల్ని సన్నాసులంటూ ఎంఎస్‌రాజు వ్యాఖ్యలు చేశారని అన్నారు. న్యాయం చేయమంటే సన్నాసులంటావా అంటూ ఆగ్రహించారు. దళితులకు కూడా న్యాయం చేయలేని స్థితిలో ఆయన ఉన్నారని విమర్శించారు. ఎన్నికల్లో యువతకు ఇచ్చిన హామీ అమలు చేయకపోతే ఎమ్మెల్యేల ఇళ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. నాయకులు సాకే శ్రీనివాసులు, దాదాఖలందర్, అంజి, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

అనంతలో లఘుచిత్రం షూటింగ్



సినిమా చిత్రీకరణలో నటీనటులు

అనంతపురం టౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన కళాకారులచేత లఘుచిత్రం షూటింగ్ జరుగుతోంది. నేత్ర లక్ష్మీ పిక్చర్స్ పతాకంపై సుజాత అశోక్‌బాబు నిర్మాణ సారథ్యంలో ఓటీటీ సిరీస్ సినిమాను చిత్రీకరిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం స్థానిక హౌసింగ్‌బోర్డులోని భక్తాంజనేయస్వామి ఆలయ ప్రాంగణంలో యూట్యూబ్ స్టార్ ప్రష బేబి(ప్రశాంత్), జీటీవీ ఫేమ్ ఝాన్సీ, బేబీ లక్కీ, యూట్యూబర్ ధరణి, ఎల్ఐసీ మురళి ముఖ్యపాత్రలుగా షూటింగ్ నిర్వహించారు. చిత్రానికి ప్రణీత్ సాయి డైరెక్షన్, పీఎస్‌కే సాయి కిరణ్ కెమెరా, కేతిరెడ్డి సుదర్శన్‌రెడ్డి పర్యవేక్షణ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అనంతపురం కళాకారులచే సినీ చిత్రీకరణ చేపడుతుండడం తమ అదృష్టంగా భావిస్తున్నట్లు నిర్మాత సుజాత అశోక్‌బాబు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

నేను చంద్రబాబు విధేయుడిని: జేసీపీఆర్



తాడిపత్రి, జూలై 23(ఆంధ్రజ్యోతి): తాను చంద్రబాబుకు విధేయుడని మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి స్పష్టంచేశారు. బుధవారం స్థానిక నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ) నాగరాజు నాయుడు అవినీతి చిట్టా తన వద్ద ఉందని, వాటిని కోర్టుకు అందజేస్తామని అన్నారు. ఏఎస్పీపై మాట్లాడిన మాటలను కూడా రికార్డులతో సహా చూపించి వివరిస్తానన్నారు. వైసీపీ హయాంలో తనను, తన కుమారుడిని జైలులో పెట్టి హింసించారని, నేరుగా సజ్జల రామకృష్ణారెడ్డి జైలు అధికారులకు ఫోన్‌చేసి తనకు సహకరించవద్దని చెప్పారని అన్నారు. తనపై ఉన్న అన్ని కేసులు రాష్ట్రంలో ఎవరిపైనా లేవని, కరోనా సమయంలోనూ తనను జైలుకు పంపించారని వాపోయారు. మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి సబ్‌రిజిస్ట్రార్‌లో మేనేజ్ చేసి మున్సిపాలిటీ స్థలాన్ని ఆక్రమించుకున్నారని, తాడిపత్రిలో అనేక అక్రమ లేఔట్లు వెలిశాయని అన్నారు. వీటిపై ఎనిమిది నెలల నుంచి వినతులను కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డీపీఓకు అందజేశామని, కలెక్టర్, జాయింట్ కలెక్టర్ చెప్పినా డీపీఓ ఈ అక్రమాలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. తాను ఈ విషయమై మాట్లాడడానికి ఆయన ఆఫీసుకు వెళితే.. ఆయన తప్పించుకొని తిరుగుతున్నాడని ఆరోపించారు.

సర్వసభ్య సమావేశంలో సమస్యల వెల్లువ



మాట్లాడుతున్న ఎంపీపీ పెద్దన్న

బెళుగుప్ప, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పెద్దన్న అధ్యక్షతన బుధవారం నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలను ప్రస్తావించారు. వెలుగు కార్యాలయ భవన నిర్మాణానికి 20 సెంట్లు కొనుగోలు చేశారని, కాని ప్రస్తుతం 15 సెంట్లు మాత్రమే ఉందని, విచారించి చర్యలు తీసుకోవాలని ఏపీఎం సురేఖకు టీడీపీ నాయకులు పెద్ద తిప్పయ్య ఫిర్యాదు చేశారు. అలాగే స్త్రీ నిధి రుణాలు స్వాహా చేశారని, చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వన్య మృగాల దాడిలో పంటలన్నీ నాశనం అవుతున్నాయని, చర్యలు తీసుకోవాలని ఆవులెన్న సర్పంచు రాము విన్నవించారు. అంగన్‌వాడీ కేంద్రాలను నిర్మించకుండా అక్రమాలకు పాల్పడ్డారని, విచారించి చర్యలు తీసుకోవాలని టీడీపీ జిల్లా కార్యదర్శి మల్లికార్జున కోరారు. సమావేశంలో వైఎస్ ఎంపీపీ పుష్పవతి, టీడీపీ నాయకులు ప్రసాద్, పెద్దతిప్పయ్య, తగ్గుపర్తి వెంకటనాయుడు, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్రోత్సాహకాలు

తాడిపత్రి, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని సజ్జలదిన్నె జడ్పీ హైస్కూల్‌లో గత పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పెన్షనర్ల సంఘం తరపున నగదు ప్రోత్సాహక బహుమతులను అందజేసినట్లు అధ్యక్షుడు సత్యప్రసాద్‌రెడ్డి తెలిపారు. 549మార్కులు సాధించిన ముస్కాన్‌కు రూ.5వేలు, 534మార్కులు సాధించిన మహాజికి రూ.3వేలు, 497మార్కులు సాధించిన రేవతికి రూ.2వేలు అందించినట్లు తెలిపారు. అదేవిధంగా బ్రాహ్మణపల్లి హైస్కూల్‌లో ధీరజ్‌కుమార్‌గౌడ్‌కు రూ.5వేలు, లక్ష్మికి రూ.3వేలు, ఆకాష్‌కు రూ.2వేలు అందించామని తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు ఆదినారాయణస్వామి, వీరారెడ్డి, హనుమంతరెడ్డి, అశ్వర్థరెడ్డి, రఘురామరాజు పాల్గొన్నారు.

నిధుల దుర్వినియోగంపై చర్యలు తీసుకోండి

యాడికి, జూలై 23(ఆంధ్రజ్యోతి): యాడికి గ్రామ పంచాయతీలో నిధుల దుర్వినియోగంపై విచారణ కమిటీ వేసి తగు చర్యలు తీసుకోవాలని సీపీఐ నాయకులు ఎంపీడీఓ వీరరాజుకు బుధవారం వినతిపత్రం ఇచ్చారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శి వడ్డె రాముడు మాట్లాడుతూ.. యాడికి గ్రామపంచాయతీలో దొంగ బిల్లులు పెట్టి రూ. లక్షలను కొందరు నాయకులు, ప్రజాప్రతినిధులు స్వాహా చేశారన్నారు. పారిశుధ్య కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా గ్రామ పంచాయతీలో దోపిడీకి పాల్పడడం దారుణమన్నారు. ఏడాదికాలంలో గ్రామపంచాయతీలో ఎంత సొమ్ము దుర్వినియోగం చేశారనేది నిగ్గు తేల్చాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో సీపీఐ నాయకులు బండారు రాఘవ, గరిడిశివన్న, నబీరసూల్ ఉన్నారు.

నేషనల్ మజ్దూర్ యూనియన్ కమిటీ ఎన్నిక



డిపో అధ్యక్ష, కార్యదర్శులను సన్మానిస్తున్న సభ్యులు

తాడిపత్రి, జూలై 23(ఆంధ్రజ్యోతి): తాడిపత్రి నేషనల్ మజ్దూర్ యూనియన్ కమిటీ ఎన్నిక బుధవారం నిర్వహించినట్లు రీజనల్ సెక్రటరీ ప్రతాప్‌నారాయణ తెలిపారు. డిపో అధ్యక్షుడిగా సి. మహేశ్వర్, కార్యదర్శిగా కేజీఎన్ బాబును ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు తెలిపారు. వారిని రాష్ట్ర సంయుక్త కార్యదర్శి భాస్కర్‌నాయుడు, నాయకులు బాలనారాయణ, బాలపెద్దన్న, వాసు, గంగన్న, మురళీమోహన్, వెంకటస్వామి సన్మానించారు.

ఐదుకల్లులో ఆగిన మొహర్రం

బెళుగుప్ప, జూలై 23(ఆంధ్రజ్యోతి): శెట్టూరు మండలంలోని ఐదుకల్లు గ్రామంలో మొహర్రం వేడుకలు ఆగిపోయాయి. మంగళవారం రాత్రి పెద్ద సరిగెత్తు కార్యక్రమం నిర్వహించారు. పీర్ల మండపంలోకి తాము కూడా వెళ్తామని దళితులు... వెళ్లకూడదని బీసీ కులానికి చెందిన వర్గం వారు ఘర్షణ పడ్డారు. శెట్టూరు ఎస్ఐ.. సిబ్బందితో గ్రామానికి వెళ్లి బీసీలకు నచ్చజెప్పి దళితులను ఆలయ ప్రవేశం చేయించారు. ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు ఎక్స్‌కవేటర్ సాయంతో అగ్నిగుండాన్ని మూయించారు. దీంతో గ్రామంలో మొహర్రం వేడుకలు ఆగిపోయాయి.

సీనియర్ పాత్రికేయుడు మృతి



పరమేశ్వరప్ప (ఫైల్)

గుమ్మఘట్ట, జూలై 23(ఆంధ్రజ్యోతి): సీనియర్ పాత్రికేయుడు, నేత్రపల్లి వాసి పరమేశ్వరప్ప బుధవారం ఉదయం అనారోగ్యంతో అనంతపురం ఆసుపత్రిలో మరణించాడు. పరమేశ్వరప్ప వివిధ పత్రికల్లో 25 సంవత్సరాలు పనిచేశారు. పరమేశ్వరప్ప మృతికి పలువురు సంతాపం తెలిపారు.

టీడీపీ నాయకుడికి నివాళి

గుంతకల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 45వ వార్డు టీడీపీ బూత్ ఇన్‌చార్జి భీమా యాదవ్ అనారోగ్యంతో బుధవారం మరణించాడు. ఆయన మృతదేహానికి ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు వెంకటశివుడు యాదవ్, నాయకులు బండారు ఆనంద్, ఆమ్లెట్ మస్తాన్‌యాదవ్, పరశురాముడు, ప్రభాకర్, వాల్మీకి రమణ, గోపాల్ నివాళులర్పించారు.

ప్లాస్టిక్ కవర్ల విక్రేతలకు జరిమానా

గుంతకల్లుటౌన్, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ధర్మవరం గేట్ రోడ్డు, కన్యకాపరమేశ్వరి దేవాలయం ఏరియాలోని దుకాణాల్లో మున్సిపల్ అధికారులు దాడులు నిర్వహించారు. ప్లాస్టిక్ వాడుతున్న పలు దుకాణాదారులకు రూ.6500 జరిమానా విధించారు. దాడుల్లో మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ లక్ష్మీదేవి, శానిటేషన్ ఇన్స్‌పెక్టర్, సచివాలయ శానిటేషన్ కార్యదర్శులు పాల్గొన్నారు.

అదును దాటుతున్నా అందని కందులు

● కనిపించని వ్యవసాయాధికారులు ● అయోమయంలో రైతులు



వేపులపర్తి ఆర్‌బీకేలో ఉన్న కందులు

బ్రహ్మసముద్రం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఖరీఫ్ పంట కాలం సీజన్ మొదలై మూడు నెలలు గడుస్తున్నా వ్యవసాయాధికారుల నిర్లక్ష్యం కారణంగా తమకు సకాలంలో విత్తనాలు అందడంలేదని రైతులు వాపోతున్నారు. మండల వ్యవయాసాయాధికారి బదిలీలో భాగంగా వచ్చి నెల రోజులైనా ఇప్పటివరకు రైతులకు అందుబాటులో లేరు. సచివాలయ సిబ్బంది మండల వ్యవసాయాధికారి లేకపోవడం వారికి ఇష్టం వచ్చినట్లు విధులు నిర్వహిస్తున్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల సాగుపై ఆసక్తి చూపుతున్నారు. ప్రభుత్వం రాయితీతో అందించే కంది, పెసర ప్రత్యామ్నాయ విత్తనాల పంపిణీ ఇప్పటివరకు చేయకపోవడంతో వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే విత్తనాలు ఆర్‌బీకే కేంద్రంలో నిల్వ ఉంచారు. మండలంలో ఇప్పటివరకు పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చేపట్టిన దాఖలాలే లేవు. ఖరీఫ్ సాగుకు రైతులు సిద్ధమైనా... వ్యవసాయాధికారులు మాత్రం తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. కందులు కంది విత్తనాలను రైతులకు అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. సీజన్ ముగిసిన తరువాత రైతులకు అందిస్తే ప్రయోజనం ఉండదని, సకాలంలో అందిస్తేనే వాటిని సాగు చేస్తారని రైతులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి కంది విత్తనాలను వెంటనే పంపిణీ చేసేలా చర్యలు తీసుకోవాలని రైతులు విజ్ఞప్తి చేస్తున్నారు.

తనిఖీకి వచ్చారంటే తలుపులు మూతే..!



అధికారుల దాడుల సమయంలో కణేకల్లులో మూసివేసిన ఓ ఎరువుల దుకాణం (ఫైల్)

కణేకల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలో ఎరువుల దుకాణాదారులు ఏ అధికారి అయినా తనిఖీకి వస్తే చాలు.. వ్యాపారులు ఆ షాపుల బంద్ చేసుకొని వెళ్తున్నారు. వారం రోజుల నుంచి కేంద్ర అధికారులు ప్రత్యేక తనిఖీ చేస్తున్నట్లు తెలుసుకుంటున్న దుకాణాదారులు చడీచప్పుడు లేకుండా తమ షాపులను మూసేసుకుని అందుబాటులో లేకుండా పోతున్నారు. నాసిరకం ఎరువులు, విత్తనాలు, కాలం చెల్లిన మందులు అధిక ధరలకు ఎరువుల విక్రయాలు తదితర విషయాలు బయట పడుతాయేమోనన్న ఆందోళనతోనే దుకాణాలు ఇలా చేస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కొందరు అధికారులు దుకాణాదారులతో మిలాఖత్ అయి తనిఖీ అధికార సమాచారాన్ని ఎప్పటికప్పుడు స్థానిక దుకాణాదారులకు ముందుగానే చేరవేస్తుండడంతో వారు షాపులను మూసివేస్తున్నట్లు తెలుస్తోంది. అలాగే అప్పుడప్పుడు వ్యవసాయాధికారులు కూడా నామమాత్రంగా తనిఖీలు నిర్వహించి చేతులు దులుపేసుకుంటుండడంతో దుకాణాదారులు ఇష్టారాజ్యంగా రెచ్చిపోతున్నారు. ఈ ప్రాంతంలో హెచ్చెల్సీ ఆయకట్టు ఉండడంతో ఏటా ఖరీఫ్, రబీలో రూ. కోట్ల ఎరువులు, పురుగుల మందులను విక్రయిస్తుంటారు. కొన్ని దుకాణాల్లో నకిలీ రసాయనాలు, ప్రభుత్వ అనుమతులు లేని మందులు విక్రయిస్తున్నా.. వ్యవసాయాధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో చివరకు రైతులు మాత్రం తీవ్రంగా నష్టపోతున్నారు.

నిధులు మంజూరు

పెద్దవడుగూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీపేట ఉమామహేశ్వర ఆలయం శివలింగానికి పగుళ్లు ఏర్పడడంతో పాటు ఆలయం శిథిలావస్థకు చేరుకుంది. దీంతో గ్రామపెద్దలు ఆలయం పునర్నిర్మాణానికి ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వం రూ.96 లక్షలను మంజూరు చేసిందని, త్వరలో గుడి నిర్మాణ పనులు చేపడతామని గ్రామ కమిటీ సభ్యులు బుధవారం తెలిపారు.

నమ్మిన ప్రజలను మోసం చేస్తున్నారు

వైసీపీ కౌన్సిలర్లపై ఎమ్మెల్యే అమిలినేని ధ్వజం



దుర్గంలో కరపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

కళ్యాణదుర్గం, జూలై 23(ఆంధ్రజ్యోతి): 'మిమ్మల్ని నమ్మి ఓటేసి గెలిపించిన ప్రజలను మీరు మోసం చేస్తున్నారు. అభివృద్ధి, ప్రజాసమస్యలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదు సరికదా... చేస్తున్న అభివృద్ధి పనులనూ అడ్డుకొంటున్నారు. మున్సిపల్ ఛైర్మన్ తలారి రాజ్‌కుమార్ నివసించే కాలనీలో నేను పర్యటించినప్పుడు అక్కడున్న కాలనీవాసులు సమస్యలపై ఏకరువు పెట్టారు. కనీసం డ్రైనేజీ, సీసీరోడ్లు, తాగునీటి సమస్యలు కూడా తీర్చలేదని మున్సిపల్ ఛైర్మన్‌పై విమర్శలు గుప్పిస్తున్నారు. వైసీపీ ఇన్‌చార్జ్ తలారి రంగయ్య మాటలు వింటూ కౌన్సిల్ సమావేశాలు నిర్వహించకుండా మున్సిపల్ ఛైర్మన్, కౌన్సిలర్లు అభివృద్ధిని అడ్డుకొంటున్నారు.' అని ఎమ్మెల్యే అమిలినేని సురేంద్రబాబు ధ్వజమెత్తారు. బుధవారం పట్టణంలోని పార్వతీనగర్, మారెంపల్లి, 11వ వార్డులో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తలారి రంగయ్యకు పిచ్చి పట్టిందని, ఆ పిచ్చిని ప్రజలే దించుతారని ఘాటుగా విమర్శించారు. పట్టణంలోని మారెంపల్లి కాలనీలో ఏ ఒక్క సమస్యను చెప్పుకోవడానికి వీలులేకుండా మంత్రి ఉషశ్రీచరణ్ అందరినీ భయపెట్టిందన్నారు. ఇదే కాలనీలో 11 కేవీ విద్యుత్ తీగలు తగిలి ఆరుగురు మృత్యువాతపడ్డా అప్పట్లో మంత్రి ఉషశ్రీచరణ్ నిర్లక్ష్యంగా వ్యవహరించారన్నారు. అవసరమైతే ట్రాన్స్‌కో సీఎండీతో మాట్లాడి రెండు నెలల్లోగా ఈ కాలనీలో నెలకొన్న సమస్యను పరిష్కరిస్తామని హామీనిచ్చారు. ఎవరు ఎన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని ఇబ్బందులు పెట్టినా మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో నడిపించడమే తన ప్రధాన లక్ష్యమన్నారు.

సేవ్ ఆర్డీటీ పేరుతో పోస్ట్ కార్డ్ ఉద్యమం



పోస్ట్‌కార్డులను చూపుతున్న విద్యార్థులు

కుందుర్పి, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్డీటీ జేఏసీ నాయకులు, ఆర్డీటీ సిబ్బంది, స్థానిక ఉన్నత పాఠశాల, కేజీబీవీకి చెందిన దాదాపు 300 మంది విద్యార్థులతో కలిసి సేవ్ ఆర్డీటీ పేరుతో పోస్ట్ కార్డ్ ఉద్యమాన్ని బుధవారం చేపట్టారు. ఆర్డీటీ సంస్థను ఎఫ్‌సీఆర్‌ఏను రెన్యువల్ చేయాలని డిమాండ్ చేపట్టారు. ఆ పోస్ట్ కార్డులను ప్రధాని నరేంద్రమోడీకి పంపించారు.

డీపీఓ గురించి తెలుసుకోండి: బీసీ నాయకులు

తాడిపత్రి, జూలై 23(ఆంధ్రజ్యోతి): డీపీఓ నాగరాజు గురించి పూర్తిగా తెలుసుకొని మాట్లాడాలని ఆదోని ఎమ్మెల్యే, బీజేపీ నేత పార్థసారథికి బీసీ సంఘం నాయకులు బాలసుబ్రహ్మణ్యం, జింకా లక్ష్మీదేవి హితవుపలికారు. స్థానిక ఎమ్మెల్యే నివాసంలో వారు బుధవారం మాట్లాడుతూ.. తాడిపత్రిలో అనేక అక్రమ లేఔట్‌లు వెలిశాయని, గత ప్రభుత్వంలో కొంతమంది నాయకులు అనేక చోట్ల స్థలాలు కబ్జాచేశారని, వాటిపైన మున్సిపల్ ఛైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఎనిమిది నెలల నుంచి ఫిర్యాదు చేస్తున్నా... డీపీఓ స్పందించడం లేదని మండిపడ్డారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలు అందరూ జేసీపీఆర్‌కు సమానమే అన్నారు. మరోసారి జేసీ ఫ్యామిలీ గురించి కానీ, తాడిపత్రి ప్రజల గురించి కానీ మాట్లాడితే ఖబడ్దార్ అని హెచ్చరించారు. కార్యక్రమంలో ఫక్రుద్దీన్, మునయ్య, బుజ్జి, బాబు, రమేష్, రంగనాయకులు, నాగరంగయ్య, శంకర్, నరసింహులు, అశోక్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న బీసీ సంఘం నాయకులు

బదిలీ వీఆర్వోలకు సన్మానం



వీఆర్వోలను సన్మానిస్తున్న తహసీల్దార్, సిబ్బంది

బొమ్మనహాళ్, జూలై 23(ఆంధ్రజ్యోతి): బదిలీపై వెళ్తున్న కురువళ్లి, కొళగానహళ్లి గ్రామాల వీఆర్వోలు రవికుమార్, కుళాయిస్వామిని స్థానిక రెవెన్యూ కార్యాలయంలో తహసీల్దార్ మునివేలు, సిబ్బంది బుధవారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ.. అంకితభావంతో విధులు నిర్వహించినప్పుడే సమాజంలో గుర్తింపు సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రీసర్వే డీటీ లక్ష్మీకాంత్‌నాయక్, ఆర్ఐ బాలక్రిష్ణ, వీఆర్వోలు నరసింహమూర్తి, సుజాత, యుగంధర్, శృతి, రామన్న, నాగరాజు పాల్గొన్నారు.



మద్యాన్ని ధ్వంసం చేస్తున్న సిబ్బంది

అక్రమ మద్యం ధ్వంసం


రాయదుర్గం, జూలై 23(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ స్టేషన్ సర్కిల్ పరిధిలో 77 కేసుల్లోని స్వాధీనం చేసుకున్న 872 లీటర్ల మద్యాన్ని జిల్లా డీపీఈఓ శ్రీరామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ధ్వంసం చేశారు. అదేవిధంగా అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడ్డ 24 వాహనాలను వేలం వేయగా 1,44,550 ఆదాయం వచ్చినట్లు సీఐ మహేష్‌బాబు తెలిపారు.

ఆసుపత్రి సమస్యలు పరిష్కరించండి

గుంతకల్లు, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాయ్ సాహెబ్ మిడతల హంపయ్య ఏరియా ఆసుపత్రిలోని సమస్యలను పరిష్కరించాలని సంక్షేమ, వైద్య విద్యా శాఖా మంత్రి సత్యకుమార్‌ను స్థానిక బీజేపీ నాయకులు కోరారు. స్థానిక బీజేపీ నాయకులు పసుపుల హరిహరనాథ్, పురంధర్ మంత్రిని బుధవారం విజయవాడలో విన్నవించారు. ఆసుపత్రిలో వైద్యుల కొరత ఉందని, కొందరు స్పెషలిస్టు వైద్యులు సెలవుల్లో ఉన్న కారణంగా సమస్య తీవ్రంగా ఉందని, ఆసుపత్రి అభివృద్ధికి నిధులను కేటాయించాలని కోరారు.



మంత్రితో మాట్లాడుతున్న బీజేపీ నాయకులు



కణేకల్లు చెరువులో గంగపూజ చేస్తున్న విప్ కాలవ

తాగునీటి సమస్య పరిష్కరిస్తాం: విప్

రాయదుర్గం, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలో మంచినీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేలా చర్యలు చేపడతామని ప్రభుత్వ విప్ కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. రాయదుర్గం పట్టణ సమ్మర్ స్టోరేజ్ ట్యాంక్‌కు తుంగభద్ర ఎగువ కాలువ పంపింగ్ స్టేషన్ నుంచి తాగునీరు సరఫరాను బుధవారం ప్రారంభించిన ఆయన మాట్లాడారు. గత సంవత్సరంలాగా రానున్న వేసవిలోనూ తాగునీటి ఎద్దడి ఎదురు కాకుండా సమ్మర్ ట్యాంకులో సమృద్ధిగా నీటి నిల్వలు ఉండేలా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటామన్నారు. పట్టణంలో ప్రధాన తాగునీటి పైపుల అత్యవసర మరమ్మత్తు పనుల కోసం రూ.40 లక్షలు ప్రత్యేకంగా నిధులు ఇవ్వాలని కలెక్టర్‌ను కోరామన్నారు. ఇదే కాకుండా దాదాపు రూ.76 కోట్లతో రక్షిత నీటిని అందించడం కోసం టెండర్లు ఆహ్వానించగా ఎవరు ముందుకు రాలేదన్నారు. జిందాల్ సంస్థ అక్కడ పైపులు తయారు చేస్తున్నందున వాళ్ల యాజమాన్యాలతో కూడా చెప్పామని, ఈ ప్రాంతంలో వారు పరిశ్రమ ఏర్పాటు చేశారు కాబట్టి ఇక్కడ అవసరాలు తీర్చాల్సిన బాధ్యత ఉందని గుర్తు చేశారు.

● కణేకల్లు చెరువులో గంగపూజ

కణేకల్లు: స్థానిక చెరువులో విప్ కాలువ గంగపూజ చేసి జలహారతి ఇచ్చారు. రైతులకు కష్టం రాకుండా ఎల్లవేళలా అండగా ఉంటామన్నారు. కార్యక్రమంలో చెరువు సంఘం అధ్యక్షుడు బీటీ రమేష్, గొడిశలపల్లి హనుమంతరెడ్డి, లాలెప్ప, ఆనంద్‌రాజ్, షేక్‌ఫక్రుద్దీన్, ఆది, వన్నారెడ్డి, కురుబ నాగరాజు, అనిల్, షేక్‌ముజ్జు, బాయినేని నవీన్, మారుతి పాల్గొన్నారు.

పాలకవర్గం ప్రమాణ స్వీకారం: కణేకల్లులో ఆదర్శ సొసైటీ బ్యాంకు అధ్యక్షుడిగా చంద్రశేఖర్‌గుప్తా, పాలకవర్గ సభ్యులు బుధవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఇందులో విప్ కాలవ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు మాబుసాబ్, చాంద్‌బాషా, ఎంపీటీసీ నరేంద్ర, జయరాంచౌదరి, శరభనగౌడ్, కురుబ హరి, నరేష్, తిప్పేస్వామి పాల్గొన్నారు.

సుపరిపాలనలో తొలి అడుగు: కణేకల్లులోని ఉరవకొండ రోడ్డులో సుపరిపాలనలో తొలిఅడుగు కార్యక్రమాన్ని విప్ నిర్వహించారు. ఇందులో ఆ పార్టీ నాయకులు అబ్దుల్, మహ్మద్, వెంకటేశులు, ఈరప్ప పాల్గొన్నారు.

బుగ్గ రామలింగేశ్వరుడికి అన్నాభిషేకం



స్వామివారికి అన్నాభిషేకం చేసిన దృశ్యం, శాకంబరీదేవిగా రాజరాజేశ్వరి

తాడిపత్రి, జూలై 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శ్రీ బుగ్గ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం స్వామివారికి అన్నాభిషేకం చేశారు. పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. శ్రీ రాజరాజేశ్వరి అమ్మవారికి వివిధ రకాల కూరగాయలు, ఆకుకూరలతో శాకంబరీదేవిగా అలంకరించి పూజలు చేశారు.

శాకంబరీదేవిగా చౌడమ్మ



పెద్దవడుగూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడేశ్వరిదేవి ఆలయంలో అమ్మవారు బుధవారం శాకంబరీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మను కాయగూరలు, ఆకుకూరలతో అలంకరణ చేసి పూజలు నిర్వహించారు.

నేడు ప్రత్యేక పూజలు

యల్లనూరు, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్థానిక చౌడమ్మదేవాలయంలో అమ్మవారి జయంతి సందర్భంగా గురువారం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఉదయమే అమ్మవారికి పెరుగన్నంతో చల్ల ముద్ద కార్యక్రమం ఉంటుందన్నారు.

సబ్సిడీతో కుట్టుమిషన్ల పంపిణీ



కుట్టుమిషన్లను పంపిణీ చేస్తున్న సిబ్బంది

బెళుగుప్ప, జూలై 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని తగ్గుపర్తిలో గ్రామస్వరాజ్ సంస్థ ఇన్ఫినిటీ ఫౌండేషన్ సహకారంతో 30 మంది మహిళలకు కుట్టుపై శిక్షణనిచ్చి... 50 శాతం సబ్సిడీతో కుట్టుమిషన్లు బుధవారం పంపిణీ చేశారు. ఇందులో సంస్థ ఛైర్మన్ విజయ్ కిషోర్, టీడీపీ నాయకులు రాధాకృష్ణ జయరాములు, దబ్బర వెంకటనాయుడు పాల్గొన్నారు.

తిలక్, ఆజాద్‌కు ఘన నివాళి

గుత్తి, జూలై 23(ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుడు బాలగంగాధర్ తిలక్ 169వ జయంతిని, భారత మాత ముద్దు బిడ్డ చంద్రశేఖర్ ఆజాద్ 119వ జయంతిని స్థానిక ప్రభుత్వ పెన్షనర్స్ భవనంలో బుధవారం నిర్వహించారు. వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి.. నివాళులర్పించారు. ఇందులో పెన్షనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు అబుబాకర్, కార్యదర్శి కుళ్లాయిబాబు, నాయకులు స్వర్ణాంబ, నారాయణరెడ్డి, మదిలేటి, శ్యాముల్ తదితరులు పాల్గొన్నారు.